**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

A.P VISION TV

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం : 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్: పేరపోగు వెంకటేశ్వర్లు | ఆదివారం 20-04-2025 | సంపుటి : 11 | సంచిక : 91 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## భావితరాల భవిష్యత్తు సీఎం చంద్రబాబు నాయుడే

### సీఎంకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



విజయవాడ(విజయ సారథి, ప్రతినిధి సిరివెళ్ల నాగరాజు):దార్శనికుడు, సంపద సృష్టికర్త, స్వర్ణాంధ్ర రథసారథి, విజన్ గల మహోన్నత నాయకుడు, సంక్షోభాన్ని సంక్షేమంగా మార్చే మేధావి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్కరే భావితరాలకు బంగారు భవిష్యత్తు అందిస్తారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినం సందర్భంగా ఆయన కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు." తెలుగుజాతి ప్రపంచంలోనే నెంబర్ వన్ గా, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలవాలనే సంకల్పంతో స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధన కోసం, పీ4 విధానంతో సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి పేదరిక నిర్మూలన చేయాలనే సంకల్పంతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్దే ధ్యేయంగా అలుపెరగని కృషి చేస్తున్న నిత్య కృషివలుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. నిత్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటూ రాష్ట్రాభివృద్ధికి, సమాజ సంక్షేమానికి 75 ఏళ్ల వయస్సులో యువకుడిలా నిరంతరం శ్రమిస్తున్నారు. గత ప్రభుత్వం నాశనం చేసిన ప్రభుత్వ వ్యవస్థలను, అప్పుల పాలైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే, ఐటీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి, యువతకు ఉద్యోగ అవకాశాల కోసం, పేదరిక నిర్మూలన కోసం రాత్రిపగలు శ్రమిస్తున్న మహోన్నత నేత చంద్రబాబు. సంపన్న వర్గాలు పేదలకు సాయంచేసి, వారిని కూడా పైకి తీసుకువచ్చేందుకు పీ4 విధానాన్ని ప్రారంభించారు. ఈ విధానం ద్వారా పేదలకు చేయూత ఇచ్చేందుకు మార్గదర్శుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. అలాగే, బంగారు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశాలు మెరుగవుతున్నాయి. ఎప్పటికప్పుడు నూతన ఆలోచనలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు పై ఆ భగవంతుడి చల్లని దీవెనలు, ఆరోగ్యవంతమైన జీవితాన్ని ప్రసాదించాలి" అంటూ ఎంపి కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

## త్వరలో భారత్‌కు ఎలాన్ మస్క్.. స్వయంగా ప్రకటించిన టెస్లా బాస్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో కీలక డోజ్ శాఖ అధిపతిగా వ్యవహరిస్తున్న టెక్ టైకూన్, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ భారత పర్యటనకు రాబోతున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఎక్స్ వేదికగా ప్రకటించారు.భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఎలాన్ మస్క్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ టెస్లా బాస్ నుంచి ఈ ప్రకటన రావడం విశేషం. 'ప్రధాని మోదీతో మాట్లాడటం గౌరవంగా ఉంది. ఈ ఏడాది చివర్లో భారతదేశాన్ని సందర్శించడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అంటూ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోదీ శుక్రవారం ఫోన్‌లో సంభాషించిన విషయం తెలిసిందే. సాంకేతికత, నూతన ఆవిష్కరణల్లో సహకారం, భాగస్వామ్యం గురించి వారు చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ స్వయంగా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎలాన్ మస్క్‌తో పలు అంశాలపై మాట్లాడినట్లు చెప్పారు. ఈ ఏడాది ఆరంభంలో యూఎస్ పర్యటన సందర్భంగా వాషింగ్టన్ డీసీలో మస్క్‌తో భేటీలో చర్చకు వచ్చిన అంశాలను ప్రస్తావించినట్లు చెప్పారు. సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న ప్రాముఖ్యతపై



చర్చించినట్లు తెలిపారు. ఈ రంగాల్లో అమెరికాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉంది అంటూ ప్రధాని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. టారిఫ్‌ల విషయంలో భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చల అంశం కొనసాగుతోన్న వేళ వీరిద్దరి మధ్య ఫోన్ సంభాషణ ఆసక్తికరంగా మారింది.

## చీపురు పట్టి ఎస్పీ కార్యాలయం శుభ్రం చేసిన హోం మంత్రి

గుంటూరు, ఏప్రిల్ 19 (ఆంధ్ర రేఖ ప్రతినిధి)స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా 3వ శనివారం శనివారం గుంటూరు పోలీస్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో హోంమంత్రి అనిత పాల్గొన్నారు. స్వయంగా చీపురు పట్టి చెత్తను ఊడ్చి పారిశుధ్య కార్మికుల్లో ఉత్సాహం నింపారు. పరిశుభ్ర, ఆరోగ్య, హరితాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతతో మన ఇళ్లు, వీధులను పరిశుభ్రంగా మార్చుకోవాలని ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రాష్ట్రంలో 40 ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించి పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. గడిచిన మూడు మాసాల్లో ప్రకాశం జిల్లాలో ఒక్క సైబర్ క్రైమ్ కేసు కూడా నమోదు కాలేదని అన్నారు. పల్నాడులో ఫ్యాక్షన్ తగ్గినప్పటికీ వాటి మూలాలు అక్కడక్కడా



కనిపిస్తున్నాయని అన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తుల రాకపోకలపై కూడా ప్రత్యేక నిఘా పెడుతున్నామని హోం మంత్రి అనిత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఐజి,ఎస్పి ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

### వీ.సీ ద్వారా కలెక్టర్లతో సమీక్షించిన మంత్రులు ఉత్తమ్ కుమార్, సీతక్క

నిజామాబాద్, ఏప్రిల్ 19 : జిల్లాలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ తో కలిసి సంబంధిత శాఖల మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి గురించి కలెక్టర్ మంత్రి ఉత్తమ్ కుమార్ దృష్టికి తెచ్చారు. యాసంగిలో జిల్లాలో 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 40 శాతం మేర 3.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. ఇందులో సింహభాగం 3.12 లక్షల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం సేకరణ జరిగిందని, దొడ్డు రకం ధాన్యం కేవలం 12 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు.

## ఈ-వేస్ట్ సేకరణలో ముందుండాలి

### అధికారులకు సూచించిన మంత్రినారాయణ

### నెల్లూరు స్వచ్ఛకార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



అమరావతి/నెల్లూరు,ఏప్రిల్19: వైసీపీ ప్రభుత్వం చెత్తపన్నుపై పెట్టిన శ్రద్ధ పారిశుద్ధంపై పెట్టలేదని మంత్రి నారాయణ మండిపడ్డారు. మున్సిపాలిటీ-ల నిధులను కూడా జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. పన్నులతో వచ్చే ఆదాయాన్ని.. మున్సిపాలిటీ-ల అభివృద్ధికే కేటాయిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో శనివారం ఉదయం 6 గంటలకు మంత్రి నారాయణ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. -టె-లికాన్ఫరెన్స్‌కు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఏపీ సీఎం చంద్రబాబు విదేశీ పర్యటనలో ఉండటంతో మొత్తం ఈ కార్యక్రమం బాధ్యతలు మంత్రి నారాయణకు అప్పగించారు. నెల్లూరులో లాంఛనంగా మంత్రి నారాయణ ప్రారంభించారు.ముందుగా అల్లీపురంలోని డంపింగ్ కేంద్రాన్ని మంత్రి నారాయణ పరిశీలించారు. ఏపీవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అధికారులకు నారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.... అన్ని మున్సిపాలిటీల్లో ఈ - వేస్ట్ సేకరణ భారీగా చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు, అన్ని శాఖల అధికారులు, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ - వేస్ట్ సేకరణ నిరంతరం జరిగేలా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు-చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ-ల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ర్యాలీ నిర్వాహణ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు.

## ఈ- వ్యర్థాల అనర్థాలు.. పర్యావరణ రక్షణకు ఆవరోదాలు..

### ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల భవిష్యత్ పై తీవ్ర దుష్ప్రభావం..

### ఈ- వేస్ట్ సేకరణను ఉద్యమంగా చేపడదాం..కాలుష్యాన్ని నివారిద్దాం..

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఎంఎల్ఏ గద్దె రామ్మోహన్.

విజయవాడ,ఏప్రిల్19:ఈ- వేస్ట్ ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల తీవ్రమైన అనర్థాలు పొంచి ఉన్నాయని భవిష్యత్ పై తీవ్ర దుష్ప్రభావం చూపనున్న ఈ వ్యర్థాల సేకరణను ఉద్యమంగా చేపట్టి వ్యర్థాలను రీసైకిలింగ్ చేయడం ద్వారా విలువైన లోహాల వృదాలను అరికట్టడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దెరామ్మోహన్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బెంజ్‌సర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు కాలనీలో ఏర్పాటు చేసిన ఈ - వ్యర్థాల ప్రత్యేక నిర్వ హణ (స్పెషల్ డ్రైవ్) కార్యక్రవ ూనికి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ శాస నసభ్యులు గద్దెరామ్మోహన్, విఎంసి కమీషనర్ సిహెచ్ ధ్యాన చంద్రలు ముఖ్య అతిధిగా హాజరై స్థానిక ప్రజల నుండి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాలుష్య రక్షితంగా తీర్చిదిద్దాలన్న దృడ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రతి నెల ఒక థీమ్‌తో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల ఈ వ్యర్థాల సేకరణ ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టిన్నట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్, లాప్ టాప్, ప్రింటర్, ఫాక్స్, సెల్‌ఫోన్, లాండ్ ఫోన్, ఛార్జర్, మైక్రోవేవ్, ఎలక్ట్రికల్ కుక్కర్, టీవి, డివిడి, రిమోట్, స్టీరియో టేప్ రికార్డర్, ఎసిలు, వాషింగ్ మిషన్లు, ఫాన్, పాత మోటార్లు, కరెంట్ వైర్లు, వాటర్ హీటర్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం నానాటికి పెరుగుతుందన్నారు. దైనందిక జీవితంలో ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగించనిదే ఒక్క క్షణం కూడా గడవని పరిస్థితి ఉందన్నారు. కేవలం విజయవాడ నగరంలో ప్రతి రోజు 700 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రజలు పారవేస్తున్నట్లు వెల్లడవుతుందన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులలో ఉండే లెడ్, కాడ్మియం, మెర్క్యూరీ, బెరీలియం వంటి మూలకాలు అతి ప్రమాదకరమైనవని తెలిపారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రజలు బహిరంగ ప్రదేశాలలో వ్యర్థ పదార్థాలతో కలిపి పారవేయడం వల్ల రసాయన పదార్థాలు భూమి, నీరు, గాలిలో కలవడం వలన తీవ్ర కాలుష్యమౌతున్నాయన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి కాన్సర్, గుండె జబ్బు, ఊపిరితిత్తుల వంటి అనేక




వ్యాధులతో పాటు తల్లి పాలు కూడా కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. చిన్న ఆలోచన సమాజంలో పెను మార్పులకు దారి తీస్తుందన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలలో ఉండే రసాయన పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కలిగి నిరుపయోగమైన ఎలక్ట్రానిక్ వస్తువులను స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ద్వారా ప్రభుత్వం చేపట్టిన ఈ- వ్యర్థాల సేకరణకు అందించి కాలుష్యరహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రజలకు పిలుపునిచ్చారు. సభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పరిశ్రమలు ఎక్కువగా ఉన్న నగర ప్రాంతాలలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం అధికంగా ఉంటుందన్నారు. నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించేందుకు కలక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ- వ్యర్థాలను రిసైకిలింగ్ చేయడం ద్వారా సేకరించిన మినరల్స్ కెమికల్స్ ద్వారా కోట్లాధి రూపాయలు ఆదాయం సమకూర్చుకోవచ్చునని తద్వారా ఆర్థికాభివృద్ధి దోహదపడుతుందన్నారు. నగర పాలక సంస్థ కమీషనర్ సిహెచ్ ధ్యాన చంద్ర మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ద్వారా నగరాన్ని సుందరనగరంగా తీర్చిదిదేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 20-04-2025

## సెంట్రల్ వర్శిటీ అటవీ భూములేనా....

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద వివాదాస్పదంగా మారిన 400 ఎకరాల 'కంచ గచ్చిబౌలి' భూములపై సుప్రీం కోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ (సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ–సీఈసీ) నివేదిక కీలకంగా మారింది. పర్యావరణపరంగా అడవికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఆ భూమికి ఉన్నాయని సీఈసీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఇన్నాళ్లూ ప్రభుత్వ రికార్డుల ప్రకారం, కంచ గచ్చిబౌలి భూములు 'కంచ అస్తాబల్ పోరంబోకు సర్కారీ' భూములుగా నమోదై ఉన్నాయి. సీఈసీ ఇచ్చిన నివేదికతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగే అవకాశం కనిపిస్తోంది.'కంచ గచ్చిబౌలి' భూముల వివాదంపై ఇప్పటికే సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది. ఏప్రిల్ 16న విచారణ సందర్భంగా చెట్లను కొట్టివేసిన వంద ఎకరాల్లో పర్యావరణాన్ని ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తదుపరి విచారణ మే 15కు వాయిదా వేసింది. అప్పటివరకు వివాదాస్పద '400 ఎకరాల కంచ గచ్చిబౌలి' భూముల్లో ఎలాంటి కార్యకలాపాలూ జరగకుండా స్టే విధించింది. సెంట్రల్ ఎంపర్డ్ కమిటీ నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఆనుకుని ఉన్న 'కంచ గచ్చిబౌలి' భూములపై వివాదం రేగిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టులో కేసు నమోదు కావడంతో ఏప్రిల్ 3న విచారణ మొదలైంది. చెట్ల నరికివేతను ఆపాలంటూ స్టే ఇచ్చింది. అనంతరం కేంద్ర సాధికార కమిటీని నియమించింది. ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు వివాదాస్పద 400 ఎకరాలను పరిశీలించి, సుప్రీంకోర్టుకు నివేదికను సమర్పించారు. అయితే భూమికి సంబంధించిన హక్కులను తెలంగాణ ప్రభుత్వం 2024 జులైలోనే టీజీఐఐసీకి బదలాయించింది. దీంతో టీజీఐఐసీ ఈ ఏడాది మార్చి 30న ఆ ప్రదేశంలో చెట్లను నరికివేసి భూమిని చదునుచేసే పనులు మొదలుపెట్టింది."టీజీఐఐసీ వివరాల మేరకు 122 ఎకరాల్లో చెట్లను పూర్తిగా వేర్లతో సహా కొట్టేశారు" అని నివేదికలో సీఈసీ స్పష్టం చేసింది. వాల్టా చట్టం 2004 ప్రకారం కొన్ని మినహాయింపులున్న చెట్లను కొట్టివేయాలంటే సెల్ఫ్ డిక్లరేషన్‌తో కొట్టివేయొచ్చు. ఇందుకు ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌కు ఫారం 13ఏ ఇచ్చి, నిర్దేశిత ఫీజు చెల్లిస్తే సరిపోతుందని అటవీ శాఖాధికారులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు."మార్చి 17నే టీజీఐఐసీ దరఖాస్తు చేసుకుంది. మార్చి 29న అవసరమైన పరిహారం కూడా చెల్లించింది" అని చెప్పారు. 125 మినహాయింపు లేని చెట్లను కూడా కూల్చివేసినట్లుగా ఏప్రిల్ 3న చిలుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరిశీలనలో గుర్తించారని సీఈసీ తన నివేదికలో పేర్కొంది. 1524 చెట్లను కూల్చివేయగా.. అందులో 1399 చెట్లకు వాల్టా చట్టం నుంచి మినహాయింపులున్నాయి" అని చెప్పింది. సీఈసీ మొత్తం 69 పేజీల నివేదికను సుప్రీంకోర్టుకు ఇచ్చింది. ఇందులో కంచ గచ్చిబౌలి భూములకు 'అడవి' అని చెప్పడానికి కావాల్సిన గుణం ఉందని స్పష్టం చేసింది."ప్రాథమిక పరిశీలన ప్రకారం, ఆ ప్రాంత సహజ లక్షణం, పర్యావరణ పరంగా అడవిని తలపిస్తోంది" అని నివేదికలో పలుమార్లు ప్రస్తావించింది."ఈ ఏడాది మార్చి 4న అటవీ లక్షణాలు కలిగిన భూములు గుర్తించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా చదును చేసే పనులు చేపట్టారు. వన చట్టం 2023ను పట్టించుకోకుండానే టీజీఐఐసీ చదును చేసే పనులు మొదలుపెట్టింది" అని సీఈసీ తన నివేదికలో పేర్కొంది. అలాగే టీజీఐఐసీ కూడా డీపీఆర్ సిద్ధం చేయకుండా నేరుగా అడవి వంటి లక్షణాలు కలిగిన ఆ భూమిని చదును చేయడానికి ముందుకెళ్లిందని సీఈసీ అభిప్రాయపడింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1975లో దాదాపు 2324 ఎకరాలను కేటాయించింది . విశాలమైన ప్రాంతం కావడంతో ఇదంతా పచ్చదనం, చెట్లతో నిండి ఉంటుంది. జింకలు, నెమళు కనిపిస్తుంటాయి. సీఈసీ తన నివేదికలో ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది." ఈ ప్రాంతం పర్యావరణం, పచ్చదనం పరంగా ఉన్నతంగా ఉంది. రాళ్ల అమరికలు, కుంటలు, జీవవైవిధ్యం కారణంగా అక్కడ ఏదైనా పనులు చేయాలంటే కచ్చితంగా గట్టి పరిశీలన జరగాలి. అటవీ చట్టాల ప్రకారం అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవడమైనా సరే, నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. టీజీఐఐసీ తమకు యాజమాన్య హక్కులు ఉన్నట్లుగా చెబుతున్నప్పటికీ, అన్ని అనుమతులూ తీసుకోలేదు. భూమిని మార్టిగేజ్ చేయడం కూడా ఆర్థికంగా తీవ్రమైన ఉల్లంఘనగా భావించాలి" అని చెప్పింది. ఈ భూమిని బేకాన్ ట్రస్టీషిప్ లిమిటెడ్ పేరుతో మార్టిగేజ్ చేసి నాన్–కన్వర్టబుల్ బాండ్లు జారీ చేసినట్లుగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏప్రిల్ 10న సీఈసీకి ఇచ్చిన నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. దీనిపై సుప్రీంకోర్టు ఏప్రిల్ 16న తన విచారణ సందర్భంగా స్పందించింది."భూమిని మార్టిగేజ్ చేశారా లేదా.. అనే విషయం జోలికి వేం వెళ్లదలుచుకోలేదు. మేం జీవ వైవిధ్యం గురించి మాటాడుతున్నాం" అని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి పనులూ మొదలుపెట్టకూడదుక్షేత్రస్థాయి అటవీ శాఖాధికారులు, వన్యప్రాణుల నిపుణులు, పర్యావరణవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే సంస్థ ప్రతినిధులతో కమిటీ వేసి అటవీ తరహా ప్రాంతాలను గుర్తించాలి. అటవీ చట్టం 2023 ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరంగా ఇబ్బంది॰ పర్యావరణ ప్రభావిత అంచనా అనుమతులు కూడా తీసుకోలేదు. టీజీఐఐసీ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. టీజీఐఐసీకి ఇచ్చిన అనుమతిని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రద్దు చేయాలి. వివాదాస్పద 400 ఎకరాలు సహా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంతాన్ని పర్యావరణ సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించి వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలతో సమగ్ర అధ్యయనం

# కేంద్రంలో కీలక పరిణామాలు...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19, ఢిల్లీ రాజకీయాలు అసక్తి రేకెత్తిస్తున్నాయి. అతి త్వరలోనే కేంద్రంలో కీలక పరిణామాల ఉండబోతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. చట్టాల ఆమోదం విషయంలో రాష్ట్రపతికి సుప్రీంకోర్టు కాల పరిమితి విధించిన అంశంతో పాటు కేంద్ర కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ, బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన, భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక, పార్టీలో సంస్థాగత మార్పులు సహా పలు కీలక అంశాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తోడు కేబినెట్ భేటీ జరగకపోవడం, ప్రధానిని రాష్ట్రపతిని కలవడం, బీజేపీ, కేంద్ర ప్రభుత్వ ముఖ్యుల వరుస సమావేశాల నేపథ్యంలో ఏదో జరగబోతుంది అంటూ రాజకీయంగా పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఊహాగానాలకు మరింత ఊతమిచ్చేలా కేబినెట్ జరగకపోగా వచ్చేవారం కూడా కేంద్ర కేబినెట్ భేటీ సమావేశం జరగడం లేదని తెలుస్తోంది. కేంద్రంలోని బీజేపీ అగ్ర నేతలు ప్రధానమంత్రి నురంద మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, బిఎల్ సంతోష్ ఉమ్మడిగా విడివిడిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు ప్రధాని మోదీ. ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎన్నిక, సంస్థాగతంగా పార్టీలో మార్పులపై దృష్టి సారించిన అధిష్టానం కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై కూడా ఆలోచన చేస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతుంది. కేబినెట్, పార్టీ వ్యవస్థాగత పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొందరు యువ నేతలకు కీలక బాధ్యతలు అప్పజెప్పవచ్చంటూ బీజేపీ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. రానున్న బీహార్, పశ్చమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల

### ఏం జరుగుతోంది

దృష్ట్యా ఆయా రాష్ట్రాల నేతలకు కేంద్ర కేబినెట్‌లో చోటు కల్పించే అవకాశం వుందని భావిస్తున్నారు. ఇంతకాలం తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన అన్నామలైను కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటారని ఇప్పటికే విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా వచ్చే వారం నూతన బీజేపీ జాతీయ అధ్యక్ష ప్రకటన ఉండే అవకాశం ఉంది. ఇప్పటివరకు 14 రాష్ట్రాలకు బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుల ప్రకటన పూర్తయింది. జాతీయ అధ్యక్షుడి ఎంపికకు ముందే కనీసం మరో ఐదు లేదా ఆరు రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ అధ్యక్షులను నియమించాల్సిన రాష్ట్రాల్లో మధ్య ప్రదేశ్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, కర్నాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా సహా పలు రాష్ట్రాలున్నాయి. పార్టీ బలోపేతంలో భాగంగా బీజేప జాతీయ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ లో హింస కారణంగా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన దిశగా కేంద్రం అడుగులు అవకాశం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది..దీనితో పాటు రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించి, పంపించిన బిల్లులు విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం తెలిపే విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తదుపరి ఏ విధంగా ముందుకు వెళ్ళాలన్న దానిపైనా కేంద్ర ప్రభుత్వ, బీజేపీ ముఖ్యులు చర్చిస్తున్నట్లు సమాచారం.!

# యాదాద్రి జిల్లా లో రైతుల కష్టాలు

### అకాల వర్షాల బీభత్సం

### – తడిసిన ధాన్యం, తల్లడిల్లుతున్న రైతులు

యాదాద్రి ఏప్రిల్ 19,యాదాద్రి జిల్లాలో అకాల వర్షాలు అన్నదాతలను కన్నీరు పెట్టిస్తున్నాయి. చౌటుప్పల్ మార్కెట్ యార్డులో రైతులు కళ్లముందు తమ ధాన్యం తడిసి ముద్దవుతుంటే నిస్సహాయంగా చూస్తున్నారు. భారీ ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులతో ఒక్కసారిగా విరుచుకుపడిన వర్షం వారి ఆశలను నీరుగార్చింది. అష్ట కష్టాలు పడి పండించిన పంటను అమ్ముకుందామనుకున్న సమయంలో ఈ అకాల వర్షాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఐకేపీ, పీఏసిఎస్ సెంటర్ లు,మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం కుప్పలపై కప్పిన పట్టాలు బలమైన గాలులకు ఎగిరిపోయాయి. దీంతో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమకు నష్టం వాటిల్లకుండా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు. 17 శాతం తేమ ఉండేలా వారం రోజుల నుండి కష్టపడి ఎండ పెడితే అకాల వర్షం రైతులను నిండా ముంచింది.. ఈదురు గాలులు,ఉరుములు మెరుపులు లతో వర్షం బీబత్సం సృష్టిస్తుంది..ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లైట్లు లేక, గాలికి పట్టాలు కొట్టుకు పోయి, కారు చీకట్లో పాములు, తేల్లు వర్షపు నీటిలో కొట్టుకు ని ధాన్యం రాసుల్లోకి వస్తున్నా తడిసిన ధాన్యం కల్లా ల లో మహిళా రైతులు సహితం తడిసిన బట్టలతో ప్రాణాలు అరి చేతిలో పెట్టికుని తమ ధాన్యం తడిసి పోతుందనే బాధతోనే ఐకేపి, పిఎసి ఎస్ కేంద్రాల్లోనే బిక్కు బిక్కుమనుకుంటూ అక్కడే ఉన్నారు.. ఎవరికి చెప్పుకోవాలో కుడా తెలియడం లేదంటూ మనో వేదన పడుతున్నారు....

# ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్...

హైదరాబాద్, ఏప్రిల్ 19, గతంలో ఎంబీబీఎస్ పాఠ్యపుస్తకాలు, మెడికల్ విద్యను ప్రాంతీయ భాషల్లో ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఇంజినీరింగ్ విద్యలోనూ పలు మార్పులు చేసేందుకు కసరత్తు చేస్తుంది. ఇందులో భాగంగా ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ప్రాంతీయ భాషల్లో అందించడానికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) చర్యలు చేపడుతోంది. స్థానిక భాషల్లో ఇంజనీరింగ్ పాఠ్య పుస్తకాలను అందించడానికి కసరత్తు చేస్తోంది. వివిధ విభాగాల్లో ఇప్పటికే కార్యచరణ ప్రారంభించారు కూడా. తద్వారా ప్రాథమిక, హైస్కూల్ విద్యను మాతృభాషలో చదువుకుని ఇంజినీరింగ్‌లో ఆంగ్లమాధ్యమంతో ఇబ్బందులు పడుతున్న వారు స్థానిక భాషలోనే చదువుకుని అర్థం చేసుకునేందుకు వీలుకల్పిస్తోందని ఓ ఇంటర్వ్యూలో ఎఐఅఇ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం తెలిపారు. మొదటి, రెండవ సంవత్సరం ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సులకు సంబంధించిన దాదాపు 600 పాఠ్యపుస్తకాలను ఇప్పటికే 12 ప్రాంతీయ భాషలలో తయారు చేసి అప్‌లోడ్ చేశామని చెప్పారు. వీటిలో హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో కూడా పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మూడవ, నాల్గవ సంవత్సరం పాఠ్యపుస్తకాలు త్వరలోనే పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. 2026 డిసెంబర్ నాటికి 12 భారతీయ భాషల్లో పూర్తి స్థాయిలో ఇంజినీరింగ్ డిప్లొమా, డిగ్రీ కోర్సుల్లో పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. దీంతో త్వరలోనే హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ.. మొత్తం 12 ప్రాంతీయ భాషల్లో బోధనకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించిన పుస్తకాల రూపకల్పనలో నిమగ్నమయింది. సాంకేతిక విద్యా వ్యవస్థలో భాషా అవరోధాన్ని నివారించడానికి ఏఐసీటీఈ గతంలోనే ప్రాంతీయ భాషలో ఇంజినీరింగ్ విద్యను ప్రవేశపెట్టింది. దేశ వ్యాప్తంగా 18 ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ ప్రోగ్రామ్ కోసం 11 ప్రాంతీయ భాషల్లో 1140 సీట్లను ఏఐసీటీఈ ఆమోదించింది. తొలి ఏడాది 2021?22లో కేవలం 233 సీట్లు, ఆ తర్వాత ఏడాది 2022?23లో 683 సీట్లు, 2023?24లో 928 సీట్లలో విద్యార్థులు చేరారు. ఇంజినీరింగ్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సుల్లో ప్రాంతీయ భాషల్లో పాఠ్య పుస్తకాలను ఏఐసీటీఈ రూపొందిస్తోంది. ఈ పుస్తకాలను స్థానిక భాషల్లో వేగంగా తర్జుమా చేసేందుకు కృత్రిమమేధ సాయాన్ని తీసుకుంటోంది. దాదాపు 80 శాతం కచ్చితత్వంతో 10 నిమిషాల్లో పుస్తకాన్ని తర్జుమా చేస్తోంది. మిగిలిన 20 శాతం తప్పొప్పులను నిపుణులు సరిదిద్దుతున్నారు. భారత రాజ్యాంగంలో 22 గుర్తింపు పొందిన భాషలు ఉన్నప్పటికీ, నిధుల పరిమితుల కారణంగా ప్రస్తుత దృష్టి 12 ప్రధాన భాషల్లో మాత్రమే అనువదిస్తోంది. అయితే ఈ చొరవ తప్పనిసరి కాదని, వారి మాతృభాషలో చదువుకోవడం లో మరింత సౌకర్యంగా ఉన్న విద్యార్థులకు ఇది ఒక ఆప్షన్ మాత్రమేనని సీతారాం అంటున్నారు. కెనడా, స్విట్జర్లాండ్ దేశాలు ఫ్రెంచి, జర్మన్ వంటి స్థానిక భాషల్లో ఉన్నత విద్యను అందిస్తున్నాయని, ఇదే బాటలో రష్యా, చైనా, జపాన్ కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రయత్నం గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను మరింత అందుబాటులోకి తేవడానికి దోహదం చేస్తుందని ఎఐఅఇ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం వివరించారు.

# చర్లపల్లికి దారేది...

హైదరాబాద్, ఏప్రిల్ 19,సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికులకు కొంత అసౌకర్యం తప్పడం లేదు. స్టేషన్లో జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా అనేక రైళ్లను చర్లపల్లి, కాచిగూడ, నాంపల్లి వంటి ఇతర స్టేషన్లకు మళ్లించడంతో ప్రయాణికులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఏ రైలు ఎటు వెళ్తుందో సరైన సమాచారం లేకపోవడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా చర్లపల్లికి చేరుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్ని ఎంఎంటీఎస్‌లు, ఆర్టీసీ బస్సులు నడుస్తున్నప్పటికీ.. సమయానికి అక్కడికి చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో చర్లపల్లి నుండి తిరిగి ఇళ్లకు చేరుకోవడం కూడా వారికి పెద్ద సమస్యగా మారింది. ఉప్పల్‌కు చెందిన ఒక ప్రయాణికుడు తిరుపతి వెళ్లడానికి రైలు టిక్కెట్లు బుక్ చేసుకున్నాడు. ముందుగా సికింద్రాబాద్ నుండి బయలుదేరాల్సిన రైలును చర్లపల్లికి మళ్లించారని అతనికి చివరి నిమిషంలో తెలిసింది. దీంతో ఉప్పల్ నుండి హబ్సిగూడకు చేరుకుని, అక్కడి నుండి చర్లపల్లికి వెళ్లడానికి ప్రయత్నిస్తే ఒక్క బస్సు కూడా అందుబాటులో లేదు. చేసేది లేక క్యాబ్ బుక్ చేసుకుంటే అది కూడా పలుమార్లు రద్దయింది. చివరకు ఒక ఆటోవాలా ఏకంగా రూ. 600 డిమాండ్ చేశాడు. సమయం మించిపోతుండటంతో వేరే దారి లేక అతను అడిగినంత డబ్బు ఇచ్చి చర్లపల్లి చేరుకున్నాడు. అక్కడితో ఆగలేదు అతని కష్టాలు. తిరుగు ప్రయాణానికి కూడా సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో అతను ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. దీనివల్ల అతనికి అదనంగా చాలా డబ్బు ఖర్చయ్యిందని అతను తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇలాంటి అనుభవాలు ఇప్పుడు చాలా మంది ప్రయాణికులకు ఎదురవుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రతిరోజు సుమారు 250 జతల రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే.. జరుగుతున్న నిర్మాణ పనుల దృష్ట్యా ఇప్పటికే 6 జతల రైళ్లను శాశ్వతంగా చర్లపల్లి టెర్మినల్‌కు మళ్లించారు. మరో 26 జతల రైళ్లను తాత్కాలికంగా ఇతర స్టేషన్ల మీదుగా నడుపుతున్నారు. తాజాగా మళ్లించిన రైళ్లతో చర్లపల్లిలో ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. తిరుపతి – ఆదిలాబాద్, లింగంపల్లి – కాకినాడ టౌన్, కాజీపేట – హడాప్సర్, లింగంపల్లి – విశాఖపట్టణం, సంబల్‌పూర్ – నాందేడ్, విశాఖపట్టణం – నాందేడ్, నర్సాపూర్ – నాగర్‌సోల్, వాస్కోడిగామా – జసిదిహ్, మచిలీపట్నం – సాయినగర్ షిర్డీ, విశాఖపట్టణం – ఎల్‌టీటీ ముంబై వంటి ముఖ్యమైన రైళ్లను చర్లపల్లికి మళ్లించారు.

# భాగ్యనగరంలో భారీగా పెరిగిన కాస్ట్ ఆఫ్ లివింగ్

### కనీసం రూ.30 వేలు..


హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రాథమిక విద్య పూర్తి అయిన తర్వాత ఉన్నత విద్యా కోసం చాలామంది విద్యార్థులు పట్టణాలకు లేదా నగరాలకు వెళుతూ ఉంటారు. పట్టణాల్లో చదువు పూర్తి చేసుకున్న వారు ఉపాధి కోసం నగరాలకు వెళుతూ ఉంటారు. తెలంగాణలో ఏ మూలనో ఉన్న వారు సైతం హైదరాబాదులో జీవించాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు. ఎందుకంటే హైదరాబాదులో ఏదో ఒక పని చేసుకుంటూ ఉపాధి పొందవచ్చని.. అలాగే డబ్బు బాగా సంపాదించవచ్చని అనుకుంటారు. అయితే ప్రస్తుత కాలంలో జీతాలతో పాటు.. ఖర్చులు కూడా బాగానే పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంటి అద్దె విషయంలో తడిసి మోపెడ అవుతుందని ఇక్కడకి వలస వచ్చిన వారు చెబుతున్నారు. వచ్చే జీవితంలో సగం వరకు ఇంటి అద్దె చెల్లించడానికి సరిపోతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇన్ఫో మెన్స్ ఆన్లైన్ మీడియా స్టార్ టాప్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్ ఓ సర్వే నిర్వహించింది. హైదరాబాదులో లివింగ్ కాస్ట్ ఎలా ఉంది? అనే దానిపై రీసెర్చ్ చేసి వివరాలను బయటపెట్టింది. ఈ పరిశోధనలో భాగంగా మొత్తం దేశవ్యాప్తంగా 10 ప్రధాన నగరాలను ఎంచుకుంది. ఇందులో ముంబై రూము 35, 887 తో మొదటి స్థానంలో ఉండగా.. జైపూర్ 27,813 తో చివరి స్థానంలో నిలిచింది. హైదరాబాదు ఆరవ స్థానంలో నిలిచింది. హైదరాబాదులో జీవించాలంటే నెలకు కనీసం 30 నుంచి 50 వేల వరకు ఖర్చు అవుతుందని ఈ సంస్థ తెలిపింది. ఇందులో ప్రధానంగా అద్దె ఇంటికి రూ.8, 000 చెల్లించాల్సిందే. ఇది కూడా సింగిల్ రూమ్ మాత్రమే. కాస్త ఫ్లెక్సిబుల్ రూమ్ కావాలంటే కనీసం రూపం 15 వేల వరకు అవుతుంది. ఇక కిరాణా ఖర్చులు, రవాణా ఖర్చులు, నిత్యవసరాలు, అదనపు ఖర్చులు కలిపి మొత్తం 31,000 అవుతుందని ఈ సంస్థ తెలిపింది. ఇక పిల్లల స్కూల్ ఫీజులు తోపాటు వైద్య ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తుంది. ప్రస్తుతం సామాన్యులు వీటితోనే సతమతమవుతున్నారు. సినిమా లేదా ఇతర వ్యసనాలు ఉంటే మాత్రం ఈ ఖర్చుల్లో కొన్ని మాయం అవుతుంటాయి. ఎందుకంటే ఫ్యామిలీతో కలిసి సినిమాకు వెళ్లాలంటే కనీసం రూ.1500 వరకు అవుతుంది. సామాన్యులు నెలకు ఒక్కసారి సినిమాకు వెళ్లిన కనీసం రూ.2,000 వరకు చెల్లించాల్సిందే. ఇక పార్కులు లేదా ఫంక్షన్ల లాంటి కార్యక్రమాలకు మరింత ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అయితే కొందరు వచ్చిన ఆదాయం సరిపోకపోవడంతో అదనంగా అప్పులు చేయాల్సి వస్తుంది. ఇలా బ్యాంకు నుంచి కూడా రుణాలు తీసుకొని జీవితాన్ని గడుపుతున్నారు. అయితే మిగతా ప్రదేశాల్లో కంటే హైదరాబాదులో అన్ని ధరలు పెరిగిపోయాయి. దీంతో సగటు మానవుడు ఇక్కడ జీవించాలంటే కనీసం రూ. 50వేల ఆదాయం వస్తూ ఉండాలి.

# ఉదయం వక్కపూత... సాయంత్రం కుండపూత

హైదరాబాద్, ఏప్రిల్ 19, తెలంగాణ వాతావరణం చాలా వైవిధ్యంగా మారుతోంది. శుక్రవారం ఉదయం నుంచి సూర్యుడు నిప్పులు కురిపించాడు. సాయంత్రానికి వరుణుడు వచ్చి వడగళ్ల వానతో వాతావరణాన్ని చల్లబరిచాడు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నగరాన్ని ముంచేసింది. చాలా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఆఫీస్‌ల నుంచి వచ్చే టైం కావడంతో జనం ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్‌లోని మాదాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, ఫిలింనగర్, గచ్చిబౌలి, అత్తాపూర్, నార్సింగి, కోకాపేట్, కోఠి, నాంపల్లి, అబిడ్స్ ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, రాజేంద్రనగర్, అంబర్‌పేట్, ఉప్పల్, సికింద్రాబాద్, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి, హయత్‌నగర్ వర్షం కుమ్మేసింది. దాదాపు హైదరాబాద్ వ్యాప్తంగా అరగంటపాటు వర్షం కురిసింది. ఈ వర్షంతో మహానగరం అతలాకుతలమైపోయింది. ఉరుములు మెరుపులు, ఈదురుగాలు?లతో కూడిన వర్షం వణికించింది. బస్సులు, కార్లు, వాహనాలు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. చెట్లు పడటంతో మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. వర్షం జోరుగా పడటంతో అధికారులు చేపట్టే సహాయక చర్యలకు కూడా త్వరగా పూర్తి కాలేదు. వర్షం తగ్గిన తర్వాత పనులు పూర్తి చేశారు. హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణలో చాలా జిల్లాల్లో జోరువానలు కురిశాయి. సిద్దిపేట, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వడగళ్లవాన ప్రజలను భయపెట్టింది. ఈ అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. గత నెల రోజు నుంచి రోజూ ఏదో ప్రాంతంలో కురుస్తున్న వడగళ్ల వాన పంటలకు నష్టాన్ని కలిగిస్తోంది. మహారాష్ట్ర నుంచి అంతర్గత కర్ణాటక, రాయలసీయ, తమిళనాడు మీదుగా గల్ఫ్ మన్నార్ వరకు ఏర్పడిన ద్రోణి ఈ వాతావరణానికి కారణమవుతోంది. మరో మూడు రోజులు తెలంగాణలో ఇలాంటి పరిస్థితే ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండులు తారెత్తిస్తాయి. సాయంత్రానికి ఉరుములు మెరుపులు, పిడుగులు, వడగళ్ల వాన దంచి కొట్టబోతోంది. అందుకే మూడు రోజుల పాటు పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం ఉదయం వరకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలు: నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.

# తులసి దాస్ హనుమాన్ చాలీసాను హిందీ నుండి తెలుగులోకి అనువదించిన గేయ రచయిత ఎమ్మెస్ రామారావు

## -నేడు ఆయన వర్ధంతి



ఎమ్మెస్ రామారావు పూర్తిపేరు మోపర్తి సీతారామారావు. ఈయనకు సుందర దాసు అనే బిరుదు ఉంది. ఈయన తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకుడు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తాహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా అనే ఎంకి పాట పాడించాడు. గేయ రూపంలో ఈయన రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము ఎమ్మెస్ రామారావు సుందరకాండ గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఈ రెండూ ఈయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. తొలినాళ్లు ఎమ్మెస్ రామారావు 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య మరియు మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఈయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో మరియు గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. రామారావు గారికి 1942 లో లక్ష్మి సామ్రాజ్యంతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె (వెంకట సరోజిని) మరియు ఇద్దరు కుమారులు (బాబూరావు, నాగేశ్వరరావు)సినీరంగంలో...ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచుకున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా అనే ఎంకి పాట పాడించారు. ఆ చిత్రంలో నాయక పాత్ర ధరించిన సి.హెచ్. నారాయణరావుకు ఇది గాత్రదానం. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. తరువాత ఈయన దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసించిన ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది. 1963 సంవత్సరాంతంలో కొన్ని కారణాల వల్ల మద్రాసు వదిలి రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్(ఎంఈ)లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగులోనికి అనువదించారు మరియు తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయరచన చేశాడు. 1975 నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్సరంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరాబాదులో సహజ కారణాల వల్ల మరణించాడు.

# వెనక్కి తగ్గని స్మితా సబర్వాల్

హైదరాబాద్, ఏప్రిల్ 19, తెలంగాణలో సర్వత్రా వివాదాస్పదమైన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఏఐ ఫొటోను రీట్వీట్ చేసిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌కు తెలంగాణ పోలీసుల నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. పోలీసుల నోటీసులకు స్మితా సబర్వాల్ ఏ మాత్రం వెరవడం లేదు. పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తనదైన శైలిలో.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ట్వీట్లను వరుసగా రీట్వీట్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదానికి సంబంధించి పలువురు రాజకీయ నేతలు, ఇతర వ్యక్తులు సోషల్ మీడియాలో చేసిన పోస్టులను డిలీట్ చేస్తున్నప్పటికీ, స్మితా సబర్వాల్ మాత్రం తన ట్వీట్‌ను తొలగించకపోగా.. ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా రీట్వీట్లు చేస్తూ.. తగ్గేదేలే అన్న సంకేతాన్ని ఇస్తున్నారు. తాజాగా.. "ఒక స్త్రీ తనకోసం నిలబడే ప్రతిసారీ, ఆమె అందరు మహిళల కోసం నిలబడుతుంది.." అంటూ మాయా ఏంజెలో చెప్పిన సందేశాన్ని పోస్ట్ చేస్తూ ఓ మహిళా నెటిజన్ చేసిన ట్వీట్‌ని ఆమె రీట్వీట్ చేశారు. గతంలోనూ.. తాను చేసిన కొన్ని కామెంట్లు, పోస్టులు పెద్ద దుమారమే రేపినా.. ఏమాత్రం వెరవకుండా చివరివరకు తన మాట మీద నిలబడుతూ.. ఎదురైన ప్రతి సందర్భాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు. కాగా.. ఇప్పుడు కంచ గచ్చిబౌలి భూముల విషయంలోనూ స్మితా సబర్వాల్ అదే ఆత్మస్థైర్యాన్ని కనబరుస్తున్నారు. కాగా.. కంచె గచ్చిబౌలి వివాదంలో ఏఐ ఫొటోను షేర్ చేసినందుకు గానూ పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేయగా.. అదే సందర్భంగా పలు ట్వీట్లను రీపోస్ట్ చేస్తూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నం చేశారు. వాటిలో ముఖ్యంగా వంద ఎకరాల భూమిని పునరుద్ధరించాలంటూ సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు సంబంధించిన ఒక ఫొటో ఉంది. ఈ ఫొటోను రీట్వీట్ చేయడం ద్వారా ఆమె ప్రభుత్వం ఆ ఆదేశాలను పట్టించుకోవడం లేదని పరోక్షంగా విమర్శిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, మరొక పోస్ట్‌లో "తెలంగాణ పోలీసులు సొంత ఐఏఎస్ అధికారికే నోటీసులు ఇస్తారా? ఇది దేనికి సంకేతం?" అంటూ ఇద్దరు మహిళలు పెట్టిన ట్వీట్‌ను స్మితా సబర్వాల్ రీపోస్ట్ చేశారు. ఈ రీట్వీట్ పోలీసుల చర్యను ప్రశ్నించే విధంగా ఉంది. ఇదిలా ఉండగా.. ఏఐతో రూపొందించిన బుల్డోజర్లు, నెమళ్లు, జింకలు ఉన్న రెండు పోస్టులను స్మితా సబర్వాల్ గతంలో రీపోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. ఈ పోస్టులకు వివరణ ఇవ్వాలంటూ



తెలంగాణ పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, ఆమె ప్రభుత్వ వ్యతిరేక ట్వీట్లను రీట్వీట్ చేయడం కొనసాగించడంపై ఐఏఎస్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిణి ప్రభుత్వంతో బహిరంగంగా విభేదించడం, పోలీసుల నోటీసులను సైతం లెక్కచేయకుండా వ్యవహరించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. స్మితా సబర్వాల్ తదుపరి చర్యలు ఎలా ఉండబోతాయో వేచి చూడాల్సి ఉంది. ఏం చర్య తీసుకోవాలి...స్మితా సభర్వాల్? తెలంగాణ ప్రభుత్వంలో పరిచయం అక్కర్లేని పేరు. బ్రిలియంట్ ఆఫీసర్ గా పేరున్న స్మితా సభర్వాల్..గత కేసీఆర్ సర్కార్ హయాంలో కీలక అధికారిగా? సీఎంవో లో పనిచేశారు. నాటి సీఎం కేసీఆర్ కు అత్యంత విశ్వాసపాత్రురాలిగా? పేరున్న అధికారి. ఉద్యమ సమయంలో మెదక్ జిల్లా కలెక్టర్ గా ఆమె పెట్టిన కన్నీళ్ళే..తెలంగాణ వ్యాప్తంగా ఆమెకు బ్రాండ్ ను తెచ్చాయి. ఆ కన్నీళ్ళే..కేసీఆర్ సర్కార్ లో స్మితకు కీలక శాఖలు దక్కేలా చేశాయి. సీఎం సెక్రటరీగా ఎంట్రీ ఇచ్చిన స్మితా సభర్వాల్? కేసీఆర్ కోటరీలో అత్యంత కీలకంగా మారిపోయారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఇరిగేషన్, మిషన్ భగీరథలకు పనిచేస్తూ..కేసీఆర్ డ్రీమ్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పై ప్రత్యేక పర్యవేక్షణ అధికారిగా స్మిత పనిచేశారు. ఇలా తొమ్మిదిన్నరేళ్ళ? స్మితా సభర్వాల్ కేసీఆర్ సర్కార్ హయాంలో ఓ వెలుగు వెలిగారు. దీంతో ఆమెకు ఎదురు చెప్పే అధికారే లేకుండా పోయారు. ఇక మేయిన్ మీడియాకు దూరంగా? సోషల్ మీడియాలో యమ యాక్టివ్ గా ఉండటం స్మితా స్టైల్. ఇలా ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, ఎక్స్, వాట్సాప్ ఇలా..సోషల్ మీడియాలో తన పోస్టులతో తీవ్ర దుమారం రేపడం స్మితా సభర్వాల్ స్పెషల్. ఆమె కన్నీళ్ళ పోస్ట్ నుండి మొదలుకొని ట్రైనీ ఐఏఎస్ పూజా కేద్ కర్ నకిలీ వైకల్యం వెలుగులోకి వచ్చిన సందర్భంలో సివిల్ సర్వీస్ లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరమా? అంటూ ఆమె పెట్టిన పోస్ట్ తెగ వివాదాస్పదమైంది. అంతేకాదు గుజరాత్ లో బిల్కిస్ బానో పై లైంగికదాడికి పాల్పడిన దోషుల విడుదలపై స్మితా ట్వీట్ మరోసారి కాంట్రవర్సికి తెరతీశారు. అధికారిగా ఉంటూ..బీఆర్ఎస్ ఎజెండాతో ట్వీట్ చేస్తారా అంటూ?.. గల్లీ నుండి..ఢిల్లీ వరకు స్మితా. ఇక సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించినా.. కనీసం కర్టసీకి కూడా? సీఎంను కలువకపోవడం. .మంత్రి సీతక్క ముందు కాలుమీద కాలేసుకుని కూర్చోవడం నెట్టింట్లో తీవ్ర దుమారం రేపింది. ఇలా ఆమె అనేక విమర్శలను మూట కట్టుకున్నారన్న చర్చ సోషల్ మీడియాలో జరుగోతంది. ఇక ఎక్స్, ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లలో ఆమె పెట్టే టాటూస్ ఫోటోలు యమ ట్రెండింగ్ గా మారడంతో స్మితపై తీవ్ర విమర్శలు వెళ్లువెత్తిన సందర్భాలు కూడా ఉన్నాయనే చర్చ నడుస్తోంది.

# ఇదెక్కడి చోద్యం...మంత్రి పదవి కోసం కమలా హారిస్ రికమండేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 19, తెలంగాణ మంత్రి పదవి కోసం అమెరికా రికమండేషన్..ఏంటీ ఆశ్చర్యపోతున్నారా? అవును..సీఎం రేవంత్ మంత్రివర్గంలో బెర్త్ కోసం అమెరికా తాజా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కాంగ్రెస్ కీలక నేత రాహూల్ గాంధీకి సిఫారసు చేశారట. ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇప్పించాలని కమలా హారిస్ నుంచి రికమండేషన్ లేఖ కూడా రావడంతో రాహూల్ గాంధీ అవాక్కయ్యారని ఢిల్లీ కాంగ్రెస్ వర్గాల్లో తెగ చర్చ జరుగుతోందట. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ డైలీ సీరియల్ ను తలపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 16 నెలలు దాటిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా ఆయన మంత్రివర్గంలో మొత్తం 12 మంది ఉన్నారు. క్యాబినెట్ లో ఇంకా ఆరుగురికి అవకాశం ఉంది. దీంతో చాలా మంది సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రి పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. లోక్ సభ ఎన్నికల తరువాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఊరిస్తూ వస్తున్న కాంగ్రెస్ అధిష్టానం అప్పటి నుంచి వాయిదాలమీద వాయిదాలు వేస్తూనే వస్తోంది. మంత్రి పదవిని ఆశిస్తున్న ఆశావహులు అధికం కావడంతో ఇటీవల మంత్రివర్గ విస్తరణను కాంగ్రెస్ అధిష్టానం నిరవధికంగా వాయిదా వేసినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. క్యాబినెట్ విస్తరణ ఇదిగో అదిగో ఇన్నాళ్లూ ఊరిస్తూ వచ్చిన కాంగ్రెస్ అధిష్టానం చివరకు ఇప్పట్లో లేదనే సంకేతాలు ఇవ్వడంతో ఆశావహుల ఎమ్మెల్యేలంతా ఊసురుమంటున్నారు. పార్టీ అధిష్టాన తీరుపై కాస్తా గుర్రుగానే ఉన్నారట. అలా కొంతమంది ఎమ్మెల్యే అలకపాన్పు ఎక్కారంట. మంత్రి పదవులు మాకు ఇస్తారా లేదా ఏదో ఒకటి తేల్చిచెప్పాలని డిమాండ్ సైతం చేస్తున్నారంట. మంత్రివర్గ విస్తరణను కాంగ్రెస్ అధిష్టానం నిరవధికంగా వాయిదా వేసినప్పటికీ..తగ్గేదేలే అంటూ అమాత్య పదవులను ఆశిస్తున్న వాళ్లంతా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారంట. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ రెడ్డి నుంచి మొదలు ఢిల్లీ లెవల్లో ఎవరికి వారు మంత్రి పదవుల కోసం తెగ పైరవీలు చేస్తున్నారంట. ఇన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ తమకు మంత్రి పదవి దక్కుతుందో లేదోనన్న ఆందోళన సైతం వారిని వెంటాడుతోందట. ఇటువంటి సమయంలో ఇక్కడ ప్రయత్నిస్తే వర్కవుట్ అవుతుందో లేదో అన్న అనుమానంతో ఓ సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏకంగా అమెరికా నుంచి రికమండేషన్ చేయించడం ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో సంచలనంగా మారింది. మంత్రి పదవి ఆశిస్తున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యే..ఏకంగా అమెరికా తాజా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తో ఢిల్లీలో ఉన్న కాంగ్రెస్ అధిష్టానానికి సిఫారసు చేయించారని తెలుస్తోంది. ఈ విషయం తెలిసిన మిగతా ఆశావహులంతా ఒక్కసారిగా షాక్ కు గురయ్యారంట. మంత్రి పదవి కోసం ఏకంగా అమెరికా నుంచే రికమండేషనా అంటూ ఆశ్చర్యపోతున్నారంట. సదరు కాంగ్రెస్ ఎమ్మెల్యేకి మంత్రి పదవి ఇచ్చేలా చొరవ తీసుకోవాలని అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్? ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి రికమెండ్ చేశారట.

ఈ మేరకు రాహూల్ కు ఆమె ఓ లేఖ కూడా రాశారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తెలంగాణ క్యాబినిట్ లో మంత్రి పదవి కోసం ఏకంగా అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ నుంచి లేఖ రావడంతో రాహూల్ గాంధీ సైతం అవాక్కయ్యారట. మంత్రి పదవి కోసం అమెరికా నుంచి రికమండేషన్ చేయించుకున్న ఆ ఎమ్మెల్యే ఎవరా అని పార్టీ నేతల ద్వారా ఆరా తీస్తున్నారట రాహూల్ గాంధీ. ఇప్పుడీ విషయం ఏఐసీసీతో పాటు ఢిల్లీ రాజకీయవర్గాల్లో సంచలనం రేపుతోంది. ఓ రాష్ట్ర మంత్రి పదవి కోసం ఏకంగా అమెరికా నుంచి రికమండేషన్ చేయించుకోవడం కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే బహుశా ఇదే మొదటిసారి కావొచ్చన్న చర్చ జరుగుతోంది. యూఎస్ రికమండేషన్ విషయం కాస్తా? విపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ కీలకనేతల చెవిన పడిందట. దీంతో ఇప్పుడు ఈ అంశంపై అధికార కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్ లోనూ ఆసక్తికరమైన చర్చ జరుగుతోందట. ఇంతకీ కమలా హారిస్ సిఫారసు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కుతుందా లేదా అన్నదే ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్ లో ఉత్కంఠ రేపుతోందట. అగ్రరాజ్యం అమెరికా నుంచి రికమండేషన్ చేయించుకున్నా? అసలు మంత్రివర్గ విస్తరణ ఎప్పుంటుందా అని ఆశావహులంతా కళ్లల్లో ఒత్తులు వేసుకొని మరీ ఎదురుచూస్తున్నారంట. పార్టీ తీరుపై అలకబూనిన సదరు ఆశావహ ఎమ్మెల్యేలంతా పార్టీ కీలక సమావేశాలకు సైతం డుమ్మాలు కొడుతూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారన్న టాక్ సైతం కాంగ్రెస్ వర్గాల్లో విన్పిస్తోంది.

# కొండా సురేఖ వరుస వివాదాలు

వరంగల్, ఏప్రిల్ 19, కొండా సురేఖ.. మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడే వీడియో వైరల్ అవుతోంది. సెక్రటేరియట్‌లో దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ పేషీలో సరస్వతి నది పుష్కరాలకు సంబంధించిన యాప్, వెబ్‌సైట్‌ని లాంచ్ చేశారు. దానికి సంబంధించిన ప్రెస్‌మీట్ ముగిశాక.. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో ఆవిడ జరిపిన సంభాషణ.. హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి మాట్లాడిన అంశంపైనే ఇప్పుడు వివాదమంతా. తన బంధువు బిడ్డ కోసం.. ఓ ఉద్యోగం ఉంటే చూడాలంటూ.. కొండా సురేఖ మాట్లాడిన వ్యాఖ్యలు విమర్శలకు దారితీశాయ్. ఈ పైరవీ సీన్ అంతా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సహచర మంత్రి.. ఉద్యోగం చూడాలని కోరడం, సరే చేద్దాం.. ఇప్పిస్తానంటూ ఆ మంత్రి కూడా బదులివ్వడంపై.. సోషల్ మీడియాలో డిబేట్ మొదలైంది. తన అన్నయ్య మనవడు ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడని.. ఏదైనా ఉద్యోగం కోసం సిఫారసు చేయాలని కొండా సురేఖ.. తన సహచర మంత్రి శ్రీధర్ బాబుని కోరారు. ఆయన కూడా సరే అంటూ హామీ ఇవ్వడం క్షణాల్లో జరిగిపోయాయ్. ఇదంతా క్యాజువల్‌గా జరిగి ఉంటే ఎలాంటి వివాదం లేదు. ఇష్యూ ఇద్దరు మంత్రుల మధ్యలోనే ఉండిపోయేది. బయటకు తెలియకపోయేది. కానీ.. ఈ సీన్ అంతా అక్కడే ఉన్న కెమెరాల్లో రికార్డ్ అవడం, ఆ క్లిప్ బయటకు రావడం, సోషల్ మీడియాలో వైరల్ అవడంతో.. వివాదంగా మారింది. ప్రెస్‌మీట్ అవగానే.. మంత్రులు మాట్లాడుకున్నారు. అక్కడ కెమెరాలున్నాయనే కనీస అవగాహన కూడా లేకుండా.. మంత్రి తన బంధువులకు ఉద్యోగం కావాలి.. అందుకు మీ రికమండేషన్ కావాలని అడగడంపై.. సోషల్ మీడియా యూజర్లంతా విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది. తమకు కూడా ఉద్యోగాలు కావాలని, మంత్రులు సిఫారసు చేయాలని కామెంట్స్ చేస్తున్నారట. ఈ వ్యవహారం కాస్తా.. కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తీవ్ర చర్చకు దారితీసిందట. ఆ మధ్య.. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలతో పాటు తెలుగు చలనచిత్ర పరిశ్రమలోనే తీవ్ర దుమారం రేపాయ్. ఆవిడ చేసిన వ్యాఖ్యల్ని.. రాజకీయ నాయకులతో పాటు సినీ ప్రముఖులంతా ముక్తకంఠంతో ఖండించిన పరిస్థితి. ఈ క్రమంలో.. కొండా సురేఖ వ్యాఖ్యలపై అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేయడం, వివరణ అడగడం కూడా జరిగింది. అప్పుడే.. ఆవిడను మంత్రి పదవి నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వినిపించాయ్. చివరకు.. కొండా సురేఖ తన వ్యాఖ్యల్లో తప్పుంటే వెనక్కి తీసుకుంటున్నానని ప్రకటన చేశారు. ఇంకా.. ఈ వ్యవహారం కోర్టులో నలుగుతూనే ఉంది. ఈ ఇష్యూ.. కొండా సురేఖకు తలనొప్పిగా మారిందనేది విశ్లేషకుల మాట. అయితే.. ఇదే సమయంలో మంత్రిగారి వ్యవహారం వివాదాస్పదంగా మారడం ఇప్పుడు కొత్తేమీ కాదనే చర్చ కూడా పార్టీలో సాగుతోంది. గతంలో ఆవిడ మాట్లాడిన ఆడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయ్. మనవడి పుట్టినరోజు సందర్భంగా.. ఎవరెక్కువ డ్యాన్స్ చేస్తే వాళ్లకు తాగినంత మద్యం అంటూ చెప్పిన సెల్ఫీ వీడియో కాల్ కూడా వైరల్ అయింది. మొత్తంగా.. మంత్రి కొండా సురేఖ ఏం మాట్లాడినా.. అది వైరల్ అవడం పరిపాటిగా మారుతోందనే చర్చ పార్టీలో నడుస్తోందట. ఆమె వ్యవహారశైలి పదే పదే సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతుండటంతో.. కొండా సురేఖ గ్రాఫ్ కూడా పడిపోతోందనే చర్చ సాగుతోంది. ఆవిడ పనితీరు కూడా బాగాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయట. ఇప్పటికే.. పలుమార్లు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైన మంత్రి కొండా సురేఖ.. ఇకపై కొంత సంయమనంతో వ్యవహరిస్తే బాగుటుందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

# ఇక మెట్రో మోత...

హైదరాబాద్, ఏప్రిల్ 19, హైదరాబాద్ మెట్రో యాజమాన్యం టికెట్ రేట్ల పెంపుకోసం ప్రయత్నించినా ప్రభుత్వం ఒప్పుకోలేదు. దీంతో ఆ తర్వాత మెల్ల మెల్లగా రాయితీలు తొలగిస్తూ వచ్చారు. తాజాగా మరోసారి రేట్ల పెంపుపై చర్చ నడుస్తోంది. నష్టాల్లో నడుస్తున్న మెట్రోకు చార్జీల పెంపుతో ఊరట లభిస్తుందని అంటున్నారు. అదే జరిగితే హైదరాబాద్ లో మెట్రో ప్రయాణం మరింత భారం అవుతుంది. ఇటీవల బెంగళూరు మెట్రోలో 44శాతం మేర చార్జీలు పెంచారు. దీంతో హైదరాబాద్ మెట్రో చార్జీల అంశం మరోసారి చర్చల్లోకి వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో రూ.10 కనిష్ట టికెట్ ధర. గరిష్టంగా రూ.60 గా ఉంది. అయితే స్టూడెంట్ పాస్ లు, హాలిడే సేవర్ కార్డ్ లతో ఇన్నాళ్లు మెట్రో ప్రయాణికులు కాస్త ఊరట పొందారు. కానీ ఇటీవల వాటిని కూడా యాజమాన్యం రద్దు చేసింది. దీంతో రాయితీలు పూర్తిగా ఎత్తేసినట్టయింది. అంటే ఒకరకంగా చార్జీల పెంపుకి రంగం సిద్ధమవుతున్నట్టే లెక్క. కరోనా టైమ్ లో హైదరాబాద్ మెట్రో భారీగా నష్టాలు చవిచూసింది. ఆ తర్వాత కూడా మెట్రో నిర్వహణ మేనేజ్ మెంట్ కి పెద్దగా గిట్టుబాటయ్యేలా కనపడ్డంలేదు. అడ్వర్టైజ్ మెంట్ లు, రైల్వే స్టేషన్లలో వ్యాపార కార్యకలాపాలు.. ఇలా చార్జీలు కాకుండా ఇతరత్రా ప్రయత్నాలు చేసినా పెద్దగా ఫలితం కనపడ్డంలేదు. దీంతో చార్జీల పెంపు అనివార్యంగా మారిందని యాజమాన్యం చాన్నాళ్లుగా చెబుతూ వస్తోంది. అయితే చార్జీలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే అనుమానంతో ప్రభుత్వం కాస్త ఆలోచిస్తోంది. దీంతో మెట్రో చార్జీల పెంపు కొన్నాళ్లుగా వాయిదా పడుతోంది. గత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి హైదరాబాద్ మెట్రో నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టి సంస్థ తన మొత్తం నష్టాలను రూ. 6,500 కోట్లుగా ప్రకటించింది.

ఇందులో మెట్రో భాగం కూడా ఉంది. ఈ భారాన్నుంచి బయటపడాలంటే మిగతా వ్యాపారాల్లో లాభాలు రావడంతోపాటు, మెట్రోలో కూడా నష్టాలు తగ్గాలి. అంటే కచ్చితంగా చార్జీలు పెంచడం ఒక్కటే మార్గం అని ఎల్ అండ్ టి సంస్థ ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. కరోనా కాలంలో మెట్రో తీవ్రంగా నష్టపోయినట్టు తెలుస్తోంది. గతంలో ఫేర్ అండ్ ఫిక్సేషన్ కమిటీ కూడా మెట్రో చార్జీల పెంపుకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. కనిష్ట చార్జీ రూ.10 అంటే కచ్చితంగా అది ప్రయాణికులకు వెసులుబాటుగానే ఉంటుంది. కానీ ఈ టికెట్ పై మెట్రోకి పెద్దగా వచ్చేదేమీ లేదు. ఇక గరిష్ట టికెట్ విషయంలో కూడా ఇతరత్రా ప్రైవేటు ప్రయాణ సాధనాలకంటే మెట్రో ప్రయాణం చాలా చౌక. వాస్తవానికి మెట్రో రైల్ ప్రాజెక్ట్ విషయంలో ప్రయాణికులనుంచి వసూలు చేసే చార్జీలకంటే ఇతరత్రా ఆదాయ మార్గాలపైనే యాజమాన్యాలు ఎక్కువగా ఆధారపడుతుంటాయి. కానీ హైదరాబాద్ మెట్రో విషయంలో అవి కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయని అంటున్నారు. మరోవైపు మెట్రో ఎక్స్ టెన్షన్ కి కూడా రంగం సిద్ధమవుతోంది. ఈ దశలో చార్జీల పెంపు అనివార్యం అని తేలింది. మరి దీనిపై ప్రకటన ఎప్పుడు ఉంటుందో చూడాలి.

# మళ్లీ నెల్లూరుకు అనిల్

నెల్లూరు, ఏప్రిల్ 19, మాజీ మంత్రి అనిల్ కుమార్ మరోసారి నెల్లూరు రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుంది. నెల్లూరు పట్టణ నియోజకవర్గం నుంచి రెండు సార్లు గెలిచిన అనిల్ కుమార్ ను 2024 ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ నరసరావుపేట ఎంపీగా పంపారు. అప్పట్లో ఎంపీతో పాటు స్థానిక నేతలతో అనిల్ కుమార్ యాదవ్ కు పొసగకపోవడంతో ఆయనను పార్లమెంటుకు పంపాలన్న ఉద్దేశ్యంతో నరసరావుపేట నుంచి వైసీపీ అభ్యర్థిగా జగన్ నిలబెట్టారు. అయితే గత ఎన్నికల్లో కేవలం మూడు పార్లమెంటు స్థానాల్లోనే గెలవడం, అనిల్ కుమార్ యాదవ్ కూడా ఓటమి పాలు కావడంతో కొన్నాళ్ల నుంచి ఆయన మౌనంగా ఉంటున్నారు. అయితే గత కొద్ది రోజుల నుంచి ఆయన తిరిగి నెల్లూరు రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తుంది. వరసగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ తో సమావేశమయిన తర్వాత ఆయనకు క్లారిటీ వచ్చినట్లుంది. అందుకే తిరిగి ఆయన నెల్లూరు జిల్లా పాలిటిక్స్ లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది. నెల్లూరు జిల్లాలోనే ఎక్కువగా తిరుగుతూ పార్టీ క్యాడర్ ను తిరిగి ఉత్తేజం చేసే ప్రయత్నం అనిల్ కుమార్ యాదవ్ చేస్తున్నారు. 2024 ఎన్నికల ముందు వరకూ నెల్లూరు జిల్లా వైసీపీకి కంచుకోటగా ఉండేది. కానీ 2024 ఎన్నికల్లో పూర్తిగా ఫ్యాన్ పార్టీ పట్టు కోల్పోయింది. గెలిచే స్థానాల్లో కూడా ఓటమి పాలయింది. ఈ నేపథ్యంలో అనిల్ కుమార్ యాదవ్ ను తిరిగి నెల్లూరు జిల్లాకు పంపాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిర్ణయించినట్లు



తెలిసింది. ఈ మేరకు ఆయన మాటలను, ఆహార్యం చూస్తుంటే అర్థమవుతుంది. నెల్లూరు జిల్లా అనిల్ కుమార్ సొంత ప్రాంతం కావడంతో పాటు బీసీ సామాజికవర్గానికి చెందిన నేత కావడంతో అనిల్ ను తిరిగి జిల్లానుంచి పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిసింది. ఈ మేరకు జగన్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో నెల్లూరు జిల్లాలో తిరిగి పట్టు నిలుపుకునేందుకు అనిల్ కుమార్ యాదవ్ ప్రయత్నిస్తున్నారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉండగా, అధికారంలో ఉండగా ఫైర్ బ్రాండ్ గా ముద్ర పడిన అనిల్ సేవలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే వినియోగించుకోవాలని డిసైడ్ అయినట్లు తెలిసింది.అయితే మరొక ప్రచారం కూడా విస్తృతంగా జరుగుతుంది. అనిల్ కుమార్ యాదవ్ వెంకటగిరి వైపు పడిందని పెద్దయెత్తున సోషల్ మీడియాలో క్యాంపెయిన్ జరుగుతుంది. అయితే వెంకటగిరిలో ఇప్పటికే ముఖ్యమైన నేత నేదురుమిల్లి రామ్ కుమార్ రెడ్డి ఉండటంతో ఆయనను తప్పించి అనిల్ కుమార్ యాదవ్ ను పంపుతారని అనుకోలేం. ఆయనకు తిరిగి నెల్లూరు టౌన్ నుంచి పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు కనపడుతుంది. అనిల్ కూడా తనకు పట్టున్న నెల్లూరు పట్టణం నుంచి తిరిగి పోటీ చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు కనిపిస్తుంది. ప్రసుతం నెల్లూరు సిటీ,రురల్ కో ఆర్డినేటర్ గా అనిల్ కుమార్ యాదవ్ కొనసాగుతున్నారు. మొత్తం మీద వైసీపీ ఫైర్ బ్రాండ్ మళ్లీ యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తుంది.

## తిరుమల గోశాలలో ఏం జరుగుతోంది...

తిరుమల, ఏప్రిల్ 19,తిరుపతి శ్రీ వెంకటేశ్వర గో సమ్రక్షణశాల చుట్టూ రాజకీయ వివాదం రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతోంది. వైసీపీ నాయకుడు, మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి..గత 3నెలల్లో టీటీడీ గోశాలలో 100కు పైగా గోవులు చనిపోయాయని ఆరోపించడంతో ఈ వివాదం మొదలైంది. అయితే గోవుల మరణాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, టీటీడీ నిర్లక్ష్యం కారణమని సంచలన వ్యాఖ్యలు చేశారు.గోశాల నిర్వహణలో లోపాలు, గోవులకు సరైన ఆహారం, వైద్య సంరక్షణ లేకపోవడం వల్లే ఈ మరణాలు సంభవించాయని భూమన ఆరోపించారు. అంతేకాక, గోశాల నిర్వహణ బాధ్యతలు అనుభవంలేని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌కు అప్పగించారని విమర్శించారు. అయితే భూమున కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించిన టీటీడీ వాటిని తోసిపుచ్చింది.గోశాలలో 100 గోవులు చనిపోయాయనే వాదనలను ఫేక్ న్యూస్ గా అభివర్ణించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చనిపోయిన గోవుల ఫొటోలు టీటీడీ గోశాలకు సంబంధించినవి కావని స్పష్టం చేసింది. అసలు భూమన ఈ విషయం ఎందుకు బయటకు చెప్పారనే దానిపై బీఆర్ నాయుడు వివరిస్తూ సస్పెండ్ అయిన మాజీ గోశాల అధికారి హరినాథ్ రెడ్డి ఇచ్చిన తప్పుడు సమాచారాన్ని భూమున ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.ఈ వివాదం నేపథ్యంలో టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి గోశాలను సందర్శించి, గోవులకు సరైన ఆహారం, వైద్య సదుపాయాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. గత మూడు నెలల్లో 40-43 గోవులు వృద్ధాప్యం, వ్యాధుల కారణంగా మరణించాయని..ఇది సహజమైనదని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.అయితే ఈవో చెప్పిన గోవుల సంఖ్యపై భూమన మరోసారి సందేహం వ్యక్తం చేస్తూ టీటీడీ అధికారులు, ఛైర్మన్, సీఎం చంద్రబాబు ఇచ్చిన సమాచారం వైరుధ్యంగా ఉందని విమర్శించారు. దీనిపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మరోసారి స్ట్రాంక్ కౌంటర్ ఇచ్చారు. ఆనాటి ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భూమన కూటమి ప్రభుత్వంపై బురదచల్లే కార్యక్రమం చేస్తున్నాడని మండిపడ్డారు.అసలు హరినాథ్ రెడ్డి అన్నింటికి తెగించి భూమనకు సమాచారం ఇవ్వడం, దాన్ని వైసీపీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ చేయడంతో విస్తృతంగా ప్రచారం చేయడం వెనుక అనేక ఆసక్తికరమైన విషయాలు దాగున్నాయట. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకాగానే టీటీడీని సమూళంగా ప్రక్షాళన చేయాలని భావించి వెంటనే చర్యలు చేపట్టింది.అందులో భాగంగా శ్రీవారి గోశాలపై విజిలెన్స్ విచారణ జరిపించింది. దీంతో నివేదిక బయటకు వచ్చింది. టీటీడీలో జరిగిన అక్రమాలను వెలికి తీయడంతో పాటు భవిష్యత్ లో అలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా విజిలెన్స్ నివేదిక బయటకు రాబోతుందని తెలిసిన వెంటనే వైసీపీ నేతలు ముందుగా గోశాలపై ఆరోపణలు చేయడం ప్రారంభించారంట. 100 ఆవులు చనిపోయినట్లు ప్రచారానికి తెరతీశారు. వైసీపీ సోషల్ మీడియా మొత్తం ఇలాంటి పోస్టులతోనే నిండిపోయిందట.గత ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన దారుణాలు ఎక్కడ బయట పడతాయో అన్న భయంతో ముందుగానే రోడ్డెక్కి నిందలు వేస్తున్న వైసీపీ నేతల ప్రయత్నాల్లో భాగంగానే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కూటమి సర్కార్ పై లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నాడని తెలుగు తమ్ముళ్లు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ నేరాలు ఘోరాలు జరిగాయని?అవన్నీ కూటమి సర్కార్ పై రుద్దే ప్రయత్నం భూమన చేస్తున్నాడని మండిపడుతున్నారంట.వైసీపీ హయాంలో చాలా చోట్ల గోవులు లేకుండానే దాణా కొనుగోలు అంటూ భారీ అవినీతి చేసినట్లు విజిలెన్స్ నివేదికలో బయటపడిందట. అంతేకాదు గోవులకు నాసిరకం దాణా, కాలం చెల్లిన మందులు ఇచ్చి నోరులేని మూగజీవాల ప్రాణాలను బలిగొన్నట్లు రిపోర్టులో ఉందట. ఇవన్నీ ఎక్కడ బయటపడి తమ మెడకు చుట్టుకుంటాయో అన్న అనుమానంతోనే భూమన ఫేక్ ఫోటోలతో టీటీడీ ప్రతిష్టే కాదు.

## ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి

విజయనగరం,డెంకాడ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. అక్కడి వీఆర్ఓ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. × బొద్దవలస పంచాయితీ వీఆర్ఓ శ్రీనివాసరావు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి అధికారులకు చిక్కారు. × బొద్దవలస గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులును రైతు ఆశ్రయించాడు. రైతు ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కార్యాలయం పై దాడులు చేయగా నగదు తీసుకుంటుంగా ఏసీబీకి చిక్కాడు.

## అమాత్య... యోగం ఎప్పుడు

విజయవాడ,, ఏప్రిల్ 19, జనసేన నేత నాగబాబుకు మంత్రి పదవి అందనంత దూరంలోనే ఉంది. ఆయనకు అస్సలు మంత్రి పదవి వస్తుందా? రాదా? అన్నది అనుమానం ఇప్పుడు అందరిలోనూ బయలుదేరింది. ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయనకు మంత్రి పదవి వస్తుందని, పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదని పవన్ కల్యాణ్ బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారెవరైనా సరే పదవులు వస్తాయని పవన్ అన్నారు. పవన్ కల్యాణ్ చెప్పిన దాని ప్రకారం ఉగాది నాటికే నాగబాబు మంత్రి పదవి లభిస్తుందని చెప్పారు. అయితే ఉగాది వెళ్లిపోయినా ఇప్పటి వరకూ నాగబాబు మంత్రి పదవిపై ఊసే లేదు. పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి సింగపూర్ లో ప్రమాదం జరగడం, తర్వాత ఆయన వెన్ను నొప్పితో బాధపడుతుండటంతో పాటు కొన్ని సమస్యలతో నాగబాబు మంత్రి పదవి మరికొన్నాళ్లు వాయిదా పడినట్లు తెలిసింది. దీంతో పాటు చంద్రబాబు నాయుడు కూడా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి పదిహేడో తేదీ నుంచి ఐదు రోజుల పాటు యూరప్ పర్యటనలో ఉంటారు. చంద్రబాబు తన 75వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకునేందుకు వెళుతున్నారు. దీంతో పాటు వచ్చే నెల 2వ తేదీన ప్రధాని మోదీ పర్యటన అమరావతిలో ఉండనుంది. అంటే మే మొదటి వారం వరకూ నాగబాబు మంత్రి పదవి గురించి ఆలోచన చేసే అవకాశం ఉండకపోవచ్చు. నాగబాబును పిఠాపురం నియోజకవర్గానికి పంపిన పవన్ కల్యాణ్ అక్కడ పరిస్థితులను చక్కబెట్టాలని భావిస్తున్నారని తెలిసింది. మంత్రి పదవిలో ఉంటే పిఠాపురంలో మరింతగా రాజకీయ ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచన కూడా పవన్ చేస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్సీగా ఉండి పిఠాపురంలో అన్నీ చక్కబెట్టేందుకు నాగబాబు సేవలను ఉపయోగించుకుంటే మంచిదని పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు కూడాచెబుతున్నాయి. అందుకే పవన్ కల్యాణ్ కూడా మంత్రి పదవి విషయంలో చంద్రబాబు వద్ద పట్టుబట్టడం లేదని, నిజంగా మంత్రి పదవి ఇవ్వాలనుకుంటే వెంటనే చంద్రబాబుతో మాట్లాడి గవర్నర్ అపాయింట్ మెంట్ తీసుకుని ప్రమాణ స్వీకారం చేయించేవారంటున్నారు.. కుటుంబంలో ఇద్దం మంత్రివర్గంలో ఉంటే పార్టీని బలోపేతం చేయడం కుదరదని కూడా పవన్ కల్యాణ్ భావిస్తున్నారని అంటున్నారు. అందుకే నాగబాబుకు పిఠాపురం బాధ్యతలను అప్పగించి తాను జిల్లాల పర్యటనలు చేయించాలన్న ఉద్దేశ్యంతో పవన్ కల్యాణ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఏమాత్రం పవన్ కల్యాణ్ కు ఆలోచన ఉన్నా వెంటనే మంత్రి పదవి విషయం చంద్రబాబు వద్ద ప్రస్తావించే వారంటున్నారు. దీంతో పాటు ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిపితే చంద్రబాబుకు కూడా తలనొప్పిగా ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వస్తున్న నేపథ్యంలో నాగబాబుకు మంత్రి పదవి ఇప్పట్లో లేనట్లేనన్న ప్రచారం మాత్రం జనసేన లో బాగా వినపడుతుంది.

## ఏపీకి గేమ్ ఛేంజర్ ప్రాజెక్ట్...

విజయవాడ, ఏప్రిల్ 19,ఆంధ్రప్రదేశ్ రాష్టానికి మరో భారీ ప్రాజెక్టు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి కొన్ని కీలక పెట్టుబడులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్టు కూడా ఏపీకి వస్తుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మైనింగ్ సంస్థ అయిన రియో టింటో.. గురువారం భారత్‌కు చెందిన ఏఎంజీ మెటల్స్ అండ్ మెటీరియల్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మన దేశంలో లోకార్బన్ అల్యూమినియం ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఈ ఎంవోయూ జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఏఎంజీ మెటల్స్ అండ్ మెటీరియల్స్ సంస్థను రెండు సంస్థలు ప్రమోట్ చేస్తున్నాయి. గ్రీన్‌కో, ఏఎం గ్రీన్ కలిసి దీనిని ఏర్పాటు చేశాయి.మరోవైపు అల్యూమినియం ప్లాంట్ ఏర్పాటు ద్వారా పదేళ్ల తర్వాత రియో టింటో భారతదేశంలోకి మళ్లీ అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రతిపాదిత అల్యూమినియం ప్లాంట్ ద్వారా ఏడాదికి ఒక మిలియన్ టన్నుల ప్రైమరీ అల్యూమినియం, 2 మిలియన్ టన్నుల అల్యూమినా ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఈ రెండూ గాలి, సౌర శక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా శక్తిని పొందుతాయి. ఈ ప్రాజెక్టు తొలి దశలో 5 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని ఓ పోర్టు సమీపంలోని ప్రాంతంపైనా ఫోకస్ పెట్టినట్లుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం 42 వేల నుంచి 58 వేల కోట్ల వరకూ పెట్టుబడి పెట్టొచ్చని వార్తలు వస్తున్నాయి.మరోవైపు అల్యూమినియానికి అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. తేలికగా ఉండటం, రీసైక్లింగ్ చేయడానికి అనువుగా ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ ఉంది. ముఖ్యంగా ఆటో, నిర్మాణ రంగంలో అల్యూమినియానికి ఎక్కువ డిమాండ్ ఉంది. మరోవైపు అల్యూమినియం ఉత్పత్తిలో మనదేశం రెండో స్థానంలో ఉంది. ఇక ఏపీకి సంబంధించి గ్రీన్ హైడ్రోజన్ రంగంలో కీలక ప్రాజెక్టులు వస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన కూడా చేసిన సంగతి తెలిసిందే. అలాగే బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు, ఆర్సెలార్ - మిట్టల్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ రాష్టానికి రానున్నాయి.

## ఏపీ ఎంపీల్లో విజయనగరమే టాప్

విశాఖపట్టణం, ఏప్రిల్ 19,ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందులో తెలుగుదేశం పార్టీ నుంచి 16, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు, బిజెపి నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఇద్దరు ఉన్నారు. అయితే వీరు పార్లమెంటుకు హాజరవుతున్న తీరు, సభలో వారు లేవనెత్తుతున్న ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనడం పై ఓ రిపోర్టు విడుదలైంది. ఎంపీల పనితీరుపై పిఆర్ఎస్ ఇండియా సమాచారం సేకరించింది. 18వ లోక్సభ బడ్జెట్ సమావేశాలు ఇటీవల ముగిసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రిపోర్టు నివేదికను బయటపెట్టింది పిఆర్ఎస్ ఇండియా. ఎంపీల హాజరు విషయానికి వస్తే.. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అమలాపురం ఎంపీ జిఎం హరీష్ 99% పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్ 97%, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు 93% తో రెండు మూడు స్థానాల్లో ఉన్నారు. హాజరులో ముందున్నది వీరే పార్లమెంటుకు 90 శాతానికి పైగా హాజరైన వారిలో ఏడుగురు ఎంపీలు ఉన్నారు. వారిలో కలిసెట్టి అప్పలనాయుడు, జిఎం హరీష్, శ్రీ భరత్, దగ్గుమల్ల ప్రసాదరావు, బస్తీపాటి నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ ఉన్నారు. అయితే వీరంతా తొలిసారిగా ఎంపీలుగా ఎన్నికైన వారే. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ అవినాష్ రెడ్డి 54% హాజరుతో చివరి స్థానంలో ఉన్నారు.లోక్సభలో ప్రశ్నలు వేయడంలో సైతం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన ఏకంగా 89 ప్రశ్నలు వేసి రికార్డు సృష్టించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి 84 ప్రశ్నలతో రెండవ స్థానంలో నిలిచారు. చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ 82 ప్రశ్నలు వేసి మూడో స్థానంలో నిలిచారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అత్యల్పంగా 22 ప్రశ్నలు అడిగారు.లోక్సభలో విషయానికి వస్తే తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు 22 చర్చల్లో పాల్గొని టాప్ గా నిలిచారు.

## రోజాకు జనసేన వార్నింగ్



తిరుపతి, ఏప్రిల్ 19, తిరుమల గోశాల వివాదం రచ్చ రచ్చ అవుతోంది. గోవుల మరణాలపై వైసీపీ వర్సెస్ టీడీపీ యుద్ధమే జరుగుతోంది. భూమనకు మద్దతుగా గురువారం రోజా ఎంట్రీ ఇచ్చారు. అయితే, టీటీడీనో, టీడీపీనో విమర్శించకుండా పవన్ కల్యాణ్‌పైనే ఎక్కువగా అటాక్ చేస్తూ మైండ్ గేమ్ ఆడారు ఆర్కే రోజా. సనాతన ధర్మాన్ని కాపాడుతానని చెబుతున్న పవన్ కల్యాణే.. టీటీడీ అరాచకాలు, గోవుల మృతిపై సమాధానం చెప్పాలని నిలదీశారు. తిరుమల వెంకన్నతో పెట్టుకుంటే ఎవరికీ పుట్టగతులు ఉండవని.. పవన్‌కు కూడా ఇటీవలే ఈ విషయం అనుభవంలోకి వచ్చిందంటూ.. పరోక్షంగా మార్క్ శంకర్ ఘటనను ప్రస్తావిస్తూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు.తమ సేనానిని రోజా అన్నేసి మాటలు అంటుంటే జనసైనికులు ఊరుకుంటారా? ఆ పార్టీ సీనియర్ లీడర్ బొలిశెట్టి సత్యనారాయణ, జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌లు రంగంలోకి దిగారు. రోజాకు అర్థమయ్యే భాషలోనే ఘాటైన విమర్శలు చేశారు. గోశాల ఘటనపై భూమన కరుణాకర్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు.కరుణాకర్‌రెడ్డి హారతి డ్రామా ఆడారని.. ఇప్పుడు గోవుల డ్రామా ఆడుతున్నారని జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. భూమాన వలన తిరుమల ప్రతిష్ఠ దిగజారిందన్నారు. గోశాలకు వెళ్లనివ్వడం లేదని కరుణాకర్ రెడ్డి అనడం పచ్చి అబద్ధమన్నారు. ఇక, రోజాను మాటలతో చెడుగుడు ఆడుకున్నారు బొలిశెట్టి. ఆర్కే రోజా.. ఆడా, మగా, హిజ్రా కూడా కాని.. నాల్గవ జాతికి చెందిన వ్యక్తి అంటూ ఫైర్ అయ్యారు. రోజా గతంలో దర్శనం టికెట్లు బ్లాక్‌లో అమ్ముకొని కోట్లు గడించారని విమర్శించారు. ఇప్పుడా దందా ఆగిపోవడంతో.. తిరుమలపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జనసేన విశాఖ కార్పొరేటర్, ఫైర్ బ్రాండ్ లీడర్.. మూర్తియాదవ్ మరింత రెచ్చిపోయారు. టీటీడీ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల కొండపై అన్యమత ప్రచారానికి ఒడిగట్టారని విమర్శించారు. ఇప్పుడు గోశాల వివాదం తీసుకువచ్చి తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.రోజా.. చిత్తూరు చిత్రాంగి అని.. ఐరన్ లెగ్ లేడీ అంటూ మండిపడ్డారు మూర్తి యాదవ్. రోజా తన ఐరన్ లెగ్‌తో వైజాగ్ ఋషికొండ ప్యాలెస్‌కు గృహ ప్రవేశం చేశారని.. అది ఇప్పటికీ అలాగే ఉండిపోయిందని ఎద్దేవా చేశారు. నగరి ప్రజలు రోజా నడ్డి విరిచిన ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. రోజా ఆ చిత్రాలలో నటించలేదని తిరుమలలో ప్రమాణం చేయగలరా? అని ప్రశ్నించారు మూర్తి యాదవ్.టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ వైజాగ్ వాడు అంటూ చులకన చేసి మాట్లాడారని రోజాను తప్పుబట్టారు. వారం రోజులలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కు బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. రోజా సారీ చెప్పకపోతే.. ఆమెను వైజాగ్‌లో అడుగుపెట్టనివ్వమని సవాల్ చేశారు మూర్తి యాదవ్.

## ఎమ్మెల్యే బెదిరింపులపై విచారణ షురూ..


కడప, ఏప్రిల్ 19, రాయలసీమ రాజకీయాలు అదో టైప్. అక్కడ నేతలే ఎవ్రిథింగ్. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఏదైనా జరగాలి. అక్కడ నో రూల్స్. నో చట్టం. ఓన్లీ డిక్టేటర్‌షిప్. కాదూ కూడదు అంటే రక్తచరిత్రనే. దశాబ్దాలుగా అదే తీరు. గతంలో ఫ్యాక్షనిస్టులు ఇలాంటి దందాలు చేసేవారు. ఆ తర్వాత ఫ్యాక్షన్ ఖద్దరు చొక్కా తొడగడంతో.. రాజకీయ నేతలే రాయలసీమను శాసించారు. ఇదంతా గతం. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. చట్టం ఎవరికీ చుట్టం కాదంటోంది. కానీ, ఇప్పటికీ అక్కడక్కడా పాత వాసనలు కనిపిస్తూనే ఉన్నాయి. ఫ్యాక్షన్ మార్క్ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఉదంతం కడప జిల్లాలో చర్చనీయాంశమైంది. ఏపీలోనూ రీసౌండ్ వస్తోంది. బీజుపీకి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కడప జిల్లాలో అల్ట్రాటెక్ సిమెంట్స్‌ను ఎమ్మెల్యే బెదిరిస్తున్నట్టు చెబుతున్నారు. సంస్థలో ప్రతి పనికి సంబంధించిన అన్ని కాంట్రాక్టులను తనకు, తన వారికే ఇవ్వాలని ఎమ్మెల్యే పట్టుబడుతున్నారని అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యం ఆరోపిస్తోంది. ఇప్పటికే ఆదినారాయణరెడ్డికి కొన్ని కాంట్రాక్టులు ఇచ్చామని, అన్ని కాంట్రాక్టులు శాసనసభ్యుడుకే ఇవ్వడం సాధ్యం కాదని ఆ సంస్థ చెబుతోంది. ఆయన చెప్పినట్లు చేయకపోవడంతో తమ సిమెంట్ ఫ్యాక్టరీలకు రావాల్సిన ముడి పదార్థాల సరఫరాను ఆదినారాయణరెడ్డి అడ్డుకుంటున్నారని అల్ట్రాటెక్ కంపెనీ అంటోంది. సిమెంట్ పరిశ్రమలకు లారీలు వెళ్లకుండా వాహనాలు అడ్డుపెట్టి, తన మనుషులను కాపలా పెట్టారని చెబుతోంది.చిలమకూరు ప్లాంట్‌లో సిమెంట్ ఉత్పత్తి ఆగిపోయిందని, యర్రగుంట్ల ప్లాంట్‌లోనూ ఉత్పత్తి ఆగిపోయే పరిస్థితి రావడంతో.. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని అల్ట్రాటెక్ వెల్లడించింది. ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్.. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు జగదీశ్వర్‌రెడ్డితో సహా పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అల్ట్రాటెక్ సిమెంట్స్‌కు ముడి పదార్థాల రవాణా పునరుద్ధరించారు.తనపై వచ్చిన ఆరోపణలపై ఆదినారాయణరెడ్డి స్పందించారు. అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యం వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఓఒం అన్నారు. ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని చెప్పారు. స్థానికులకు ఉపాధి దొరుకుతుందనే ఉద్దేశంతోనే గతంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి సహకరించామని గుర్తుచేశారు. అల్ట్రాటెక్ సిమెంట్స్ తీరుతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని.. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లానని ఓఒం చెబుతున్నారు. విదేశీ పర్యటన నుంచి ముఖ్యమంత్రి తిరిగొచ్చాక స్వయంగా కలిసి పరిస్థితి వివరిస్తానన్నారు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి.

# టాటూ వేయించుకున్నారా..? అయితే మీకు గుడ్ న్యూస్



టాటూ అంటే శరీరంలోని చర్మంపై సూదితో రంగులను గుచ్చి వేయించుకునే ఒక రకమైన చిత్రం లేదా అక్షరం. ఇది ఒక రకమైన శరీర అలంకరణ. టాటూలు చాలా కాలం నుండి ప్రపంచంలోని వివిధ సంస్కృతులలో ఉపయోగించబడుతున్నాయి. అవి కొన్నిసార్లు ఆధ్యాత్మిక లేదా సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి.టాటూ వేయించుకోవడం ప్రధానంగా ఒక వ్యక్తిగత ఎంపిక. ఇది కళాత్మకంగాను, ఆత్మనిర్వచనంగాను ఒక వ్యక్తిని ప్రతిబింబిస్తుంది. దీని వల్ల వచ్చే లాభాలు ఎక్కువగా మానసికమైనవే. టాటూ వేయించుకోవడం వల్ల కలిగే కొన్ని లాభాలు: తమ శరీరంపై ఒక కళాఖండాన్ని మోసుకునే భావన చాలా మందికి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. టాటూ ఒక వ్యక్తి యొక్క విలువలు, అనుభవాలు, అభిరుచులను ప్రతిబింబిస్తుంది. ఇది తనను తాను గుర్తించుకోవడానికి ఒక మార్గం.ఒక ముఖ్యమైన సంఘటన, వ్యక్తి లేదా భావాన్ని జ్ఞాపకం చేసుకోవడానికి టాటూ ఒక శాశ్వతమైన మార్గం.అదే రకమైన టాటూలు ఉన్న వ్యక్తులతో కనెక్ట్ అవ్వడానికి ఇది ఒక మార్గం.టాటూలు ఒక రకమైన కళాత్మక అభివ్యక్తి. “ లోదుస్తులు ధరించి పడుకుంటే అంతే సంగతి..!” టాటూ వేయించుకోవడం వల్ల కలిగే కొన్ని నష్టాలు: అంటువ్యాధులు, అలర్జీలు వంటివి వచ్చే అవకాటం ఉంది.కొంతమంది తర్వాత తమ టాటూ గురించి పశ్చాత్తాపపడవచ్చు.కొన్ని వృత్తులలో టాటూలు అంగీకరించబడకపోవచ్చు. టాటూ వేయించుకోవాలని నిర్ణయించుకునే ముందు ఈ విషయాలను గుర్తుంచుకోండి: మీరు ఎంచుకునే డిజైన్ మీకు ఎంతకాలం నచ్చుతుందో ఆలోచించండి. అనుభవం ఉన్న, పరిశుభ్రమైన పద్ధతులను పాటించే ఆర్టిస్ట్‌ని ఎంచుకోండి.టాటూ వేయించుకోవాలనుకునే స్థానం కూడా ముఖ్యం.టాటూ వేయించుకున్న తర్వాత దానిని జాగ్రత్తగా చూసుకోవాలి. ముగింపు: టాటూ వేయించుకోవడం ఒక వ్యక్తిగత ఎంపిక. మీరు టాటూ వేయించుకోవాలని నిర్ణయించుకుంటే, జాగ్రత్తగా ఆలోచించి, నమ్మకమైన టాటూ ఆర్టిస్ట్‌ను ఎంచుకోండి. అలాగే, టాటూ వేయించుకున్న తర్వాత సరైన జాగ్రత్తలు తీసుకోండి.


# కుక్కలు ఆత్మహత్య చేసుకుంటాయని మీకు తెలుసా..?



కుక్కలు ఆత్మహత్య చేసుకుంటాయా అనే ప్రశ్న చాలా ఆసక్తికరమైనది. మనం సాధారణంగా ఆత్మహత్య అనేది మానవులకు సంబంధించిన విషయంగా భావిస్తాము. కానీ, కుక్కలు వంటి జంతువులు ఎందుకు ఇలాంటి ప్రవర్తనను ప్రదర్శిస్తాయనేది చాలా మందికి సందేహం. స్కాట్లాండ్‌లోని ఓవర్‌టౌన్ బ్రిడ్జి: ఈ విషయానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా చాలా కథనాలు ఉన్నాయి. వాటిలో ఒకటి స్కాట్లాండ్‌లోని ఓవర్‌టౌన్ బ్రిడ్జికి సంబంధించినది. ఈ బ్రిడ్జిని ‘డాగ్ సూసైడ్ బ్రిడ్జి’ అని కూడా పిలుస్తారు. ఎందుకంటే, చాలా సంవత్సరాలుగా ఈ బ్రిడ్జి నుండి అనేక కుక్కలు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నివేదికలు వచ్చాయి. “కుక్కలు ఎందుకు ఏడుస్తాయో తెలుసా..?” ఎందుకు ఇలా జరుగుతుంది? కొందరు ఈ బ్రిడ్జి యొక్క భౌగోళిక స్థితి, వాతావరణం వంటి కారణాల వల్ల కుక్కలు ఆకర్షితులవుతున్నాయని భావిస్తున్నారు.కొందరు కుక్కలు కొన్ని రకాల మానసిక సమస్యలతో బాధపడుతున్నాయని, అందుకే ఈ విధంగా ప్రవర్తిస్తున్నాయని అంటున్నారు.కొందరు కుక్కల యజమానుల ప్రవర్తన, వారి మానసిక స్థితి కూడా కుక్కల ప్రవర్తనను ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు.నిజానికి ఏమి జరుగుతుందో ఇంకా తెలియదు.వీటిలో ఏ సిద్ధాంతం నిజమో ఇంకా స్పష్టంగా తెలియదు. ఈ విషయంపై పరిశోధకులు ఇంకా అధ్యయనం చేస్తున్నారు. 40 శాతం ఉన్న గిరిజనులు, ముస్లింలే కీలకం ముఖ్యమైన విషయం: కుక్కలు ఆత్మహత్య చేసుకుంటున్నాయనే వార్తలను చూసి చాలామంది భయపడతారు. కానీ, ఈ విషయం గురించి అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కుక్కలు మానవుల లాగా భావిస్తాయి. వాటి ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

# గాల్‌బ్లాడర్‌లో స్టోన్స్ ఎందుకు ఏర్పడతాయి..? సర్జరీ తప్పనిసరా..?

శరీరంలోని వివిధ భాగాల్లో ఈమధ్య రాళ్లు తయారు కావడం కామన్ అయిపోయింది. మూత్రపిండాలు, పిత్తాశయంలో స్టోన్స్ ఫార్మ్ కావడం గురించి తరచుగా వినబడుతున్నాయి. మొదటగా చిన్నగా మొదలై క్రమేపీ వీటి సైజ్ పెరుగుతూ పోతుంది. తద్వారా ఆయా శరీర భాగాల్లో అసౌకర్యంతో పాటు తీవ్రమైననొప్పి కలుగుతుంది. అవసరమైతే పరిస్థితి శస్త్రచికిత్స వరకు దారితీసే అవకాశం ఉంది. కొలెస్ట్రాల్ లేదా బిలిరుబిన్ స్థాయిలు పిత్తాశయంలో అధికంగా ఉన్నప్పుడు అక్కడ రాళ్లు ఏర్పడతాయి. వాటిని బయటకు పంపించడంలో పిత్తాశయం విఫలమయ్యే పక్షంలో అవి అక్కడే ఉండిపోయి సైజ్ పెరుగుతూ ఉంటాయి. తరచుగా అక్కడ రిలీజ్ అయ్యే కొలెస్ట్రాల్, కాల్షియం మరియు ఇతర ద్రవాల వల్ల రాళ్ల పరిమాణం మరియు కూర్పులో మార్పు ఉంటుంది. “పొట్లకాయ తిన్న తర్వాత తినకూడని ఆహారాలు.. పొరపాటున తిన్నారో..?” గాల్ బ్లాడర్ లేదా పిత్తాశయంలో రాళ్ల సైజ్ పెద్దదైతే ఏకంగా



ఆ భాగాన్ని సర్జరీ చేసి తీసివేయాలని వైద్యులు నిర్ణయిస్తారు. లాపరోస్కోపిక్ కోలిసిస్టెక్టమీగా పిలిచే ఈ చికిత్స.. నొప్పితో పాటు ఇతర ఆరోగ్య ప్రమాదాల నుంచి బయటపడేందుకు ఓ సురక్షితమైన ప్రక్రియగా చెప్పవచ్చు. అయితే ఈ సమస్యకు ఖచ్చితంగా శస్త్రచికిత్స అవసరం ఉంటుందని చెప్పలేము. పిత్తాశయం వాపు, గాయం, దీర్ఘకాలిక మంట, క్యాన్సర్ లేదా సాధారణ కణితులు ఏర్పడిన సందర్భాల్లో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి దాన్ని తొలగించాల్సి ఉంటుంది. అయితే దీన్ని నిర్ధారించేందుకు ముందుగా కొన్ని పరీక్షలు లేదా ప్రక్రియలు జరపాల్సిన అవసరం ఉండవచ్చు. ఇన్ఫెక్షన్ లేదా కాలేయ సమస్యలను తనిఖీ చేసేందుకు రక్త పరీక్ష, చెస్ట్ అల్ట్రాసౌండ్, అు స్కాన్‌లను రిఫర్ చేయవచ్చు.  40 శాతం ఉన్న గిరిజనులు, ముస్లింలే కీలకం । లాపరోస్కోపిక్ పద్ధతి ద్వారా సాధారణంగా పిత్తాశయం తొలగింపు చేపడతారు. ఇందులో ఒక సెంటీమీటర్ కంటే తక్కువ సైజ్‌లో చిన్న హోల్ చేస్తారు. తద్వారా తక్కువ నొప్పితో పాటు త్వరగా కోలుకుని సాధారణ రోజువారీ పనులు చేసుకోవచ్చు. చాలా మంది రోగులు సర్జరీ అనంతరం కేవలం 4-6 గంటలలోపు నడవగలరు. 24 నుంచి 48 గంటలలోపు డిశ్చార్జ్ కావచ్చు. ఓపెన్ సర్జరీ అనేది నేడు చాలా అరుదుగా జరుగుతుంది.

# దోమల బెడదను నివారించే వంటింటి చిట్కాలు.. ఇలా చేస్తే పరార్..!


దోమలు అనేవి ప్రతి ఇంట్లోనూ సాధారణ సమస్య. ఇవి ఆరోగ్యానికి ప్రమాదకరమైన జబ్బులను వ్యాప్తి చేస్తాయి. అందుకే వీటిని నివారించడం చాలా ముఖ్యం. ఎటువంటి రసాయనాలను ఉపయోగించకుండా సహజసిద్ధమైన పద్ధతులతో దొమలను నశింపజేయవచ్చు. వంటింట్లో అందుబాటులో ఉండే కొన్ని చిట్కాలతో దోమల సమస్యను సులభంగా తగ్గించుకోవచ్చు. 1. లవంగాలు లవంగాలు – నిమ్మరసాన్ని మిక్స్ చేసి దోమలు ఉండే ప్రదేశాల్లో ఉంచండి. దీని వాసన దోమలను తట్టుకోలేకపోతుంది. లవంగపు గింజలను నీటిలో ఉడికించి ఆ నీటిని ఇంట్లో అటూ ఇటూ చల్లుకోవచ్చు. లవంగపు నూనెను దీపం వెలిగించేటప్పుడు కొన్ని చుక్కలు వేయవచ్చు. ఇలా చేయడం వల్ల దోమల బెడద తగ్గుతుంది. “కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగితే కిడ్నీలో రాళ్లు వస్తాయా? “ 2. నిమ్మరసం, నిమ్మకాయ తొక్కల ఉపయోగం దోమలను ఆకర్షించకుండా చేయడానికి నిమ్మరసాన్ని నీటిలో కలిపి ఇళ్ల మూలల్లో చల్లి చూడండి. నిమ్మకాయ తొక్కలను దొమలు ఎక్కువగా చేరే ప్రదేశాల్లో ఉంచితే అవి దూరంగా ఉంటాయి. 3. వెల్లుల్లి నీరు వెల్లుల్లి రెబ్బలను కోసి గదిలో ఉంచడం ద్వారా దోమలను దూరం చేయవచ్చు. వెల్లుల్లిని నీటిలో మరిగించి ఆ నీటిని గదుల్లో స్ప్రే చేయండి. వెల్లుల్లి వాసన దోమలను దూరంగా ఉంచుతుంది. కర్పూరాన్ని చిన్న పాత్రలో వెలిగించి గదిలో ఉంచితే దొమలు మరణిస్తాయి. 4. తులసి తులసి ఆకులను నీటిలో ఉడికించి ఆ నీటిని స్ప్రే చేయవచ్చు. ఈ మొక్కలను ఇంట్లో పెంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చు. తులసి మొక్కను ఇంటి ముందు పెంచడం వల్ల కూడా దొమలు ఇంట్లోకి రావు. తులసి ఆకుల రసం దోమలను ఆకర్షించకుండా చేస్తుంది. “ఈ ఆకుల రసం తాగండి... జీవితంలో మోకాళ్ల నొప్పులు రావు” 5. లెమన్ గ్రాస్ లెమన్ గ్రాస్ నూనెను దీపం వెలిగించేటప్పుడు కొన్ని చుక్కలు వేయవచ్చు. లెమన్ గ్రాస్ ఆకులను నీటిలో ఉడికించి ఆ నీటిని స్ప్రే చేయవచ్చు. వేప నూనెను నీటిలో కలిపి గదుల్లో స్ప్రే చేస్తే దోమలు దూరంగా ఉంటాయి. 6. కాఫీ పొడి వంటింట్లో ఉన్న కాఫీ పొడి దోమలను మటుమాయం చేయడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. నీటి నిల్వ ప్రాంతాల్లో కాఫీ పొడిని చల్లితే దోమ గుడ్లు పగిలిపోతాయి. అదే విధంగా నిమ్మపొడి లేదా వేప పొడిని దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చల్లితే అవి దూరంగా ఉంటాయి. 7. నీలగిరి నూనె నీలగిరి నూనెను కొబ్బరి నూనెతో కలిపి చర్మంపై రాసుకుంటే దోమలు దూరంగా ఉంటాయి. ఈ నూనెను నీటిలో కలిపి స్ప్రే చేయడం ద్వారా కూడా మంచి ఫలితాలు వస్తాయి. పుదీనా ఆకులను మరిగించి, ఆ నీటిని గదుల్లో స్ప్రే చేస్తే దోమలు ఇంట్లో ఉండవు. “చింత గింజలతో ఎంత ఆరోగ్యమో తెలిస్తే అస్సలు పారెయ్యరు!” నివారణకు చిట్కాలు: నీరు నిల్వ ఉండే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచండి. ఇంట్లో వాతావరణాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచడం ద్వారా దోమల సమస్య తగ్గుతుంది. కిటికీలకు దోమల చంద్దులుఅమర్చడం మేలు. ఈ సహజ పద్ధతులను పాటించడం ద్వారా దోమలను దూరంగా ఉంచుకోవచ్చు . కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



# ఎక్కిళ్ళు ఆరోగ్య సమస్యలకు సంకేతమా?.. అన్నం తినేటప్పుడు వస్తే ?

ఎక్కిళ్లు అనేవి శరీరంలో డయాఫ్రాగమ్ అనే కండరానికి సంబంధించి జరగే అనియంత్రిత చర్య. ఇది ఊపిరితిత్తుల కింద ఉండే కండరమై, శ్వాసకు సహాయపడుతుంది. డయాఫ్రాగమ్ అకస్మాత్తుగా సంకోచించడం వలన శ్వాసనాళం అకస్మాత్తుగా మూసుకుపోయి ఎక్కిళ్లు వస్తాయి. ఈ శబ్దం అనేది గ్లోటిస్ నే భాగం అకస్మాత్తుగా మూసుకుపోవడం వల్ల ఉత్పన్నమవుతుంది. ఎక్కిళ్లు ఎందుకు వస్తాయి? ఎక్కిళ్లు అనేవి అనేక కారణాల వల్ల కలగవచ్చు. వేగంతో అన్నం తినడం వల్ల గాలి కూడా ఎక్కువగా పేగులలో చేరుతుంది, ఇది ఎక్కిళ్లకు దారితీస్తుంది. బిగ్గరగా నవ్వడం, వేగంగా తినడం, లేదా చల్లటి పానీయాలను తాగడం వల్ల ఎక్కువ గాలి మింగబడుతుంది. ఇలాంటి సమయంలో ఎక్కిళ్లు వచ్చే అవకాశం ఉంది. కారం ఎక్కువగా ఉన్న ఆహారం, లేదా శరీరానికి అలెర్జీ కలిగించే పదార్థాలు తీసుకుంటే ఎక్కిళ్లు వస్తాయి. మానసిక ఒత్తిడి లేదా భావోద్వేగాలు కూడా ఎక్కిళ్లకు కారణమవుతాయి. కొన్ని విటమిన్లు , ఖనిజాల లోపం కూడా డయాఫ్రాగమ్‌కు ఇబ్బంది కలిగించవచ్చు. “కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగితే కిడ్నీలో రాళ్లు వస్తాయా? “ అన్నం తినేటప్పుడు ఎక్కిళ్లు రావడం అన్నం తినేటప్పుడు ప్రత్యేకంగా ఎక్కిళ్లు రావడానికి ప్రత్యేకమైన కారణాలు ఉన్నాయి. చిన్నగా నమిలి తినకుండా పెద్ద ముక్కలు మింగడం వల్ల గాలి ఊపిరితిత్తుల్లోకి చేరుతుంది. తిన్న ఆహారపు ఉష్ణోగ్రత డయాఫ్రాగమ్‌ను ప్రభావితం చేయవచ్చు. తినేటప్పుడు తగినంత నీరు తీసుకోకపోతే ఆహారం తేలికగా దిగదు, ఇది ఎక్కిళ్లకు కారణం అవుతుంది. ఎక్కిళ్లను తగ్గించే చిట్కాలు చిన్నగా చల్లటి నీటిని మెల్లగా తాగితే ఎక్కిళ్లు తగ్గుతాయి. ఒకసారి లోతుగా శ్వాస తీసుకుని కొంతసేపు ఆపి విడుదల చేయడం వల్ల ఎక్కిళ్లు తగ్గుతాయి. ఒక స్పూన్ తేనెను నోట్లో ఉంచి మెల్లగా మింగడం ఉపశమనం ఇస్తుంది. ఎక్కిళ్లు వచ్చినప్పుడు తినే ప్రక్రియను తాత్కాలికంగా ఆపి కొన్ని నిమిషాలు వేచి చూస్తే ఫలితం ఉంటుంది. ఎప్పుడు వైద్యుడిని సంప్రదించాలి? ఎక్కిళ్లు సాధారణంగా తక్కువ సేపులో తగ్గిపోతాయి. అయితే, అవి గంటల తరబడి లేదా రోజులు పాటు కొనసాగితే, అది ఓ శరీర సంబంధ సమస్యకు సంకేతం కావచ్చు. అందువల్ల వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. ఎక్కిళ్లు చిన్న సమస్యగా కనిపించినప్పటికీ, కొన్ని జాగ్రత్తలతో అవి పూర్తిగా నివారించవచ్చు. నమిలి తినడం, ఆహారాన్ని సరిగా తీసుకోవడం వంటి అలవాట్లతో ఎక్కిళ్లను తగ్గించుకోవడం సాధ్యం.






# ప్రేమలు 'నజ్లెన్' కొత్త మూవీ.. తెలుగులో ఏం చేస్తుందో..





మాలీవుడ్ మూవీ ప్రేమలు.. గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. మలయాళంలో తొలుత రిలీజ్ అయ్యి మంచి సక్సెస్ అవ్వగా.. ఆ తర్వాత తెలుగులో కూడా అలరించింది. బాక్సాఫీస్ వద్ద సాలిడ్ వసూళ్లను రాబట్టి అటు మాలీవుడ్ లో.. ఇటు టాలీవుడ్ లో సత్తా చాటింది. అయితే ఆ సినిమాతో రెండు ఇండస్ట్రీల ప్రేక్షకులను ఆకట్టుకున్న నజ్లెన్.. రీసెంట్ గా అలప్పుజ జింఖానా మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఏప్రిల్ 10వ తేదీన మలయాళంలో రిలీజ్ అయ్యి సూపర్ హిట్ గా నిలిచింది. అంతే కాదు.. 2025లో ఇప్పటి వరకు రెండో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఘనత సాధించి దూసుకుపోతోంది. యూత్ ఫుల్ థీమ్, ఫ్రెండ్ షిప్, చిన్నపాటి గొడవలు వంటి పలు అంశాలతో ఖలీద్ రెహ్మాన్ దర్శకత్వం వహించిన ఆ సినిమా... జెన్ జెడ్ వాళ్లను ఓ రేంజ్ లో ఆకట్టుకుంటోంది. ఇప్పుడు ఆ యాక్షన్ ఎంటర్టైనర్.. తెలుగులో కూడా సందడి చేయనుంది. ఏప్రిల్ 25వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల కానుంది. అయితే ఇప్పటికే జింఖానా మూవీపై సోషల్ మీడియాలో చర్చలు జరుగుతుండగా.. తెలుగు వెర్షన్ కోసం ఈగర్లీ వెయిట్ చేస్తున్నామని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. మరో మాలీవుడ్ సూపర్ హిట్ మూవీ టాలీవుడ్ వెర్షన్ లోడింగ్ అని సందడి చేస్తున్నారు. ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని అంటున్నారు. ఇక జింఖానా మూవీ విషయానికొస్తే.. లుక్మాన్ అవరన్, గణపతి, బేబీ జీన్, సందీప్ ప్రదీప్, ఫ్రాంకో ఫ్రాన్సిస్, శివ హరిహరన్ కీలక పాత్రలు పోషించారు. ప్లాన్ బి మోషన్ పిక్చర్స్ , రియలిస్టిక్ స్టూడియోస్ గ్రాండ్ గా నిర్మించగా.. విష్ణు విజయ్ మ్యూజిక్ అందించారు. జిమ్షి ఖలీద్ డీవోపీ బాధ్యతలు పర్యవేక్షించారు. నిషాద్ యూసుఫ్ ఎడిటింగ్ బాధ్యతలు చూసుకున్నారు. అయితే ఇప్పటికే ఎన్నో మాలీవుడ్ సినిమాలు.. తెలుగులో మంచి రెస్పాన్స్ సంపాదించుకున్నాయి. అందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. నెజ్లెన్ యాక్ట్ చేసిన ప్రేమలు సినిమానే బెస్ట్ ఎగ్జాంపుల్. కంటెంట్ ఉండాలే కానీ సినీ ప్రియులు బ్రహ్మరథం పడతారు. మరి జింఖానా మూవీ ఎలా ఉంటుందో.. ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.



# అర్జున్ సర్కార్ బాక్సాఫీస్ టార్గెట్ ఎంత?

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'హిట్ : ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను డైరెక్షన్‌లో హీరో నాని నిర్మిస్తూ నటిస్తున్న ఈ మూవీ మరో రెండు వారాల్లో అంటే మే 1న భారీ స్థాయిలో వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కేజీఎఫ్ బ్యూటీ శ్రీనిధిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. తనకు ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలకం. ఇదిలా ఉంటే 'హిట్' ఫ్రాంఛైజీలో భాగంగా వస్తున్న థర్డ్ ఫిల్మ్ ఇది. తొలి రెండు భాగాల్లో విశ్వక్‌సేన్, అడివి శేష్ నటించారు. ఆ రెండూ హిట్ అనిపించుకున్నాయి. తెలుగులో ఏం చేస్తుందో.. ఇప్పుడు నాని హీరో వస్తున్న థర్డ్ పార్ట్ 'హిట్ 3'. హిట్ 2లోనే పార్ట్ 3లో నాని నటిస్తున్నాడని, అర్జున్ సర్కార్‌గా రూత్‌లెస్ కాప్‌గా కనిపించనున్నాడని హింట్ ఇవ్వడంతో ఈ ప్రాజెక్ట్‌పై సర్వత్రా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇటీవల విడుదల చేసిన ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అంచనాల్ని తారా స్థాయికి చేర్చింది. రెండు పార్ట్‌లకు మించి 'హిట్ 3' ఉంటుందని, ఆ రెండు సినిమాలకిది నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుందని తేలిపోయింది. దీంతో అంచనాలు స్కై హైకి చేరుకున్నాయి. సినిమా ట్రైలర్ రిలీజ్ సందర్భంగా మాట్లాడిన నాని ఆ అంచనాల్ని మరింతగా పెంచేశారు. ఇదిలా ఉంటే 'హిట్ 3' ప్రీ రిలీజ్ బిజినెస్ రికార్డు స్థాయిలో జరిగినట్టుగా తెలుస్తోంది. ఆంధ్రా 6 రీజియన్‌లలో రూ.15 కోట్ల వరకు బిజినెస్ చేసిందట. సీడెడ్ రూ.5 కోట్లు, నైజాం రూ.11 టు 12 కోట్లు చేయగా వరల్డ్ వైడ్‌గా థియేట్రికల్ బిజినెస్ దాదాపు రూ.40 కోట్ల వరకు జరిగినట్టుగా ఇన్ సైడ్ టాక్. ఈ నేపథ్యంలో హిట్ 3 థియేట్రికల్ షేర్ రూ.40 కోట్లకు పైనే రాబట్టాల్సి వుంటుందని అంటే రూ.75 కోట్ల మేర గ్రాస్‌ని వరల్డ్ వైడ్‌గా సాధిస్తేనే ఈ సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలుస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఓటీటీ హక్కుల రూపంలోనూ నెట్ ఫ్లిక్స్ నుంచి కూడా భారీ మొత్తం డీల్ కుదిరిందని, నాని 'హిట్ 3'కిది బిగ్ బూస్ట్‌గా మారే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.



# జాట్ 2 అనౌన్సమెంట్ వెనుక మైత్రీ ప్లాన్ ఇదేనా..?

సన్నీ డియోల్ గోపిచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జాట్ గురించి మొదట్లో బాగా చర్చ జరిగింది. బాలీవుడ్‌లో మాస్ హంగామాకు ఇది న్యూ ఏజ్ రీఎంట్రీ అంటూ ప్రచారం జరిగింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మిక్స్‌డ్ టాక్ రావడంతో రెండో వారానికి వెళ్లే సరికి థియేటర్లలో కలెక్షన్లు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో మైత్రీ మూవీ మేకర్స్ జాట్ 2ని అధికారికంగా ప్రకటించడం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సాధారణంగా ఒక సినిమా సూపర్ హిట్ అయితేనే దానికి సీక్వెల్ పిలుపు వస్తుంది. కానీ జాట్ ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా కేవలం రూ.70 కోట్ల గ్రాస్ మాత్రమే సాధించింది. ఇది సినిమా బడ్జెట్ అయిన రూ.150 కోట్లలో సగం కూడా కాదు. ఈ లెక్కల ప్రకారం సినిమా బ్రేక్ ఈవెన్ దశను దాటలేదు. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో అయితే సినిమా డిజాస్టర్ రేంజ్‌కి వెళ్లిందన్న ట్రేడ్ రిపోర్ట్‌లు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో "జాట్ 2"ని అనౌన్స్ చేయడం వెనుక అసలైన ఉద్దేశ్యం ఏమిటంటే, ఇప్పటికే డీలా పడిన కలెక్షన్లకు మరికొంత బూస్ట్ ఇవ్వాలని ఉండవచ్చు అనే టాక్ వస్తోంది. సినిమాలో ఇంకా ఆసక్తి ఉందనే భావనను పబ్లిక్‌లో నాటేందుకు మైత్రీ ఈ ప్రయత్నం చేసి ఉంటుందన్నది ఇండస్ట్రీలో వినిపిస్తున్న అభిప్రాయం. ఎందుకంటే, నిజంగా ఈ స్థాయిలో నష్టాలు వచ్చిన ప్రాజెక్ట్‌కు వెంటనే సీక్వెల్ అనౌన్స్ చేసే పరిస్థితి ఉండదు. ఇంకా ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విషయం.. సన్నీ డియోల్ ఈ సినిమాకు రూ.50 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకున్నట్టు ట్రేడ్ బజ్. అంటే ఈ ఒక్క విషయం చూసినా, నిర్మాతలకు థియేట్రికల్ షేర్ ద్వారా సగం కూడా తిరిగి రాకపోవచ్చు. పైగా డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్‌లు ఇంకా ఫైనల్ కాలేదన్న సమాచారంతో, రికవరీ చాలా కష్టమన్నది ట్రేడ్ వర్గాల అభిప్రాయం. అయితే పబ్లిక్‌కి మాత్రం ఈ అనౌన్స్మెంట్ సీక్వెల్ వస్తోందన్న ఉత్సాహాన్ని కలిగించవచ్చు. కానీ అంతకు మించి అసలు సినిమా స్టేటస్‌ను మార్చగలదు అనుకోవడం అంత ఈజీ కాదు. వాస్తవానికి జాట్ 2 అనే పేరు ప్రకటించడమే కానీ, ప్రీ-ప్రొడక్షన్ ప్రారంభం, కథ సిద్ధం, షూటింగ్ టైమ్‌లైన్ వంటి ఎలాంటి వివరాలూ ఇవ్వలేదు. ఇది ఈ ప్రాజెక్ట్ వాస్తవంగా ఉంటుందా అనే అనుమానాలను పెంచుతోంది. మొత్తం మీద జాట్ 2 ప్రకటన కంటే మైత్రీ మూవీ మేకర్స్ చేసిన టైమింగ్ మరింత ఆసక్తికరంగా మారింది. బిజినెస్ పరంగా లాభాలు కంటే నష్టాలు ఎదురవుతున్న ప్రాజెక్ట్‌కు రెండో వారానికి అయినా ఓ పాజిటివ్ ఇమేజ్ రావాలనే కోణంలో ఈ 'సీక్వెల్ ప్రకటన' జరిగిందని విశ్లేషకుల అభిప్రాయం. మరి ఇది ఫలితాన్ని ఇస్తుందో లేదో చూడాలి.




# కమల్ పొన్నియిన్‌కి విక్రమ్ నో ఎందుకు చెప్పాడు..?

తమిళ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన 'పొన్నియన్ సెల్వన్' సినిమా 2022లో మొదటి పార్ట్, 2023లో రెండో పార్ట్ వచ్చిన విషయం తెల్సిందే. తమిళనాట రెండు పార్ట్‌లకు మంచి స్పందన దక్కింది. తమిళనాట అత్యధిక వసూళ్లు సొంతం చేసుకున్న సినిమాల జాబితాలో పొన్నియన్ సెల్వన్ నిలిచింది. ఆ సినిమాలో విక్రమ్, ఐశ్వర్య రాయ్, జయం రవి, ఐశ్వర్య లక్ష్మీ, కార్తీ ఇంకా పలువురు ప్రముఖ నటీనటులు నటించిన విషయం తెల్సిందే. విక్రమ్ రెండు పార్ట్‌ల్లోనూ కీలక పాత్రలో కనిపించాడు. ఆదిత్య కరికాలన్ పాత్రలో విక్రమ్ నటించి మెప్పించాడు. కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌తో విక్రమ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన విషయం తెల్సిందే. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్నియన్ సెల్వన్ సినిమాను చేయడం తన అదృష్టం అంటూ విక్రమ్ పలు సందర్భాల్లో చెప్పుకొచ్చాడు. అయితే అదే పొన్నియన్ సెల్వన్ ప్రాజెక్ట్‌లో దాదాపు మూడు దశాబ్దాల క్రితం నటించే అవకాశం దక్కింది. కానీ ఆ సమయంలో విక్రమ్ నో చెప్పాడట. ఇటీవల తన బర్త్‌డే సందర్భంగా ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విక్రమ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.



# మూవీ రివ్యూ : అర్జున్ సన్నాఫ్ వైజయంతి

నటీనటులు: నందమూరి కళ్యాణ్ రామ్- విజయశాంతి- సయీ మంజ్రేకర్- సోహైల్ ఖాన్- శ్రీకాంత్- పృథ్వీ- ఆనంద్ తదితరులు సంగీతం: అజనీష్ లోక్ నాథ్ ఛాయాగ్రహణం: రామ్ ప్రసాద్ స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా-ప్రదీప్ చిలుకూరి మాటలు: శ్రీకాంత్ విస్సా నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా-సునీల్ బలుసు కథ-దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా తెరకెక్కిన కొత్త చిత్రం.. అర్జున్ సన్నాఫ్ వైజయంతి. లెజెండరీ నటి విజయశాంతి ఇందులో కళ్యాణ్ రామ్ తల్లిగా నటించడంతో దీనిపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది. కొత్త దర్శకుడు ప్రదీప్ చిలుకూరి రూపొందించిన ఈ చిత్రం.. ఈ రోజే మంచి అంచనాల మధ్య విడుదలైంది. ఆ అంచనాలను సినిమా ఏమేర అందుకుందో చూద్దాం పదండి. కథ: ఐపీఎస్ ఆఫీసర్ అయిన వైజయంతి (విజయశాంతి) డిపార్ట్మెంట్లో మంచి పేరుంటుంది. ఆమె భర్త నేవీ అధికారి. వీళ్లిద్దరి కొడుకు అర్జున్ కూడా ఐపీఎస్ క్లియర్ చేసి ట్రైనింగ్ తీసుకోవడానికి సిద్ధమవుతాడు. అలాంటివాడు అనూహ్య పరిస్థితుల్లో క్రిమినల్ గా మారతాడు. విశాఖపట్నంలో సమాంతర ప్రభుత్వం నడిపే స్థాయికి చేరుకుంటాడు. కొడుకు చట్టానికి వ్యతిరేకంగా వెళ్లడంతో తల్లి అతణ్ని అసహ్యించుకుని దూరం పెడుతుంది. కానీ తల్లికి పెద్ద ముప్పు ఉందని తెలిసి ఆమెను కాపాడుకునే బాధ్యత తీసుకుంటాడు అర్జున్. ఇంతకీ ఐపీఎస్ ఆఫీసర్ కావాల్సిన అర్జున్.. క్రిమినల్ ఎందుకయ్యాడు? వైజయంతికి ఎవరి నుంచి ముప్పు వాటిల్లింది? ఆమెను అర్జున్ కాపాడుకోగలిగాడా? చివరికి తల్లి మనసు గెలిచి ఆమెకు దగ్గరయ్యాడా? ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి. కథనం-విశ్లేషణ: ఈ రోజుల్లో రొటీన్ మాస్ మసాలా కథలతో ప్రేక్షకులను మెప్పించడం సవాలే. కథలో ఏదో ఒక కొత్తదనం ఉండాలి. లేదా ఒక బలమైన ఎమోషన్ అయినా తోడవ్వాలి. కథను డ్రైవ్ చేసే ఏదో ఒక టిపికల్ పాయింట్ లేకుండా రెండు రెండున్నర గంటలు ఆడియన్సుని కుదురుగా కూర్చోబెట్టడం కష్టం. కొత్త దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తన తొలి చిత్రానికి 'ఎమోషన్' బాటనే ఎంచుకున్నాడు. తల్లీకొడుకుల ఎమోషన్ మీద 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' నడిపించడానికి ప్రయత్నించాడు. తల్లేమో చట్టాన్ని కాపాడే పోలీసాఫీసర్.. కొడుకేమో చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న క్రిమినల్.. ఈ కాన్ఫ్లిక్టే ఈ చిత్రానికి ప్రధాన బలం. మిగతా కథంతా మామూలుగా అనిపించినా.. హీరో ఎలివేషన్లు- భారీ యాక్షన్ సీక్వెన్సులు అన్నీ రొటీన్ గా సాగిపోయినా.. తల్లీకొడుకుల ఎమోషన్ సినిమాను ముందుకు నడిపించేసింది. ముఖ్యంగా పతాక సన్నివేశాల్లోని షాక్ ఫ్యాక్టర్.. భావోద్వేగాలు అంతకుముందున్న లోపాలను భర్తీ చేయడంతో 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'కి పాస్ మార్కులు పడిపోతాయి. అర్జున్-వైజయంతి అనే రెండు పాత్రల చుట్టూనే ఈ సినిమా కథ నడుస్తుంది. ఐతే అందులో అర్జున్ పాత్రలో నిజానికి ఏ ప్రత్యేకతా కనిపించదు. ఐపీఎస్ క్లియర్ చేసిన వాడు.. క్రిమినల్ అయ్యాడంటూ తన పాత్రను పరిచయం చేస్తారు. దాని వెనుక ఒక బ్యాక్ స్టోరీ ఉంటుంది. అది కొన్ని వందల సినిమాల్లో చూసిందే. తనకు జరిగిన ఓ అన్యాయం మీద తిరగబడే క్రమంలో ఒక ప్రాంతానికి దేవుడిలా మారిపోవడం.. ప్రభుత్వానికి సమాంతరంగా ఒక వ్యవస్థను నడపడం.. విలన్లు అతడి పేరు చెబితే అదిరిపోవడం.. ఇదంతా ఒక టెంప్లేట్లో సాగిపోయే వ్యవహారం. యాక్షన్ సీక్వెన్సులు మాస్ ప్రేక్షకులను ఆకట్టుకున్నప్పటికీ.. కథ నడిచే విధానం అయితే రొటీన్ ఫీల్ కలిగిస్తుంది. ఐతే కేవలం 'అర్జున్'గా చూసినపుడు ఈ పాత్రలో ఏ ప్రత్యేకతా కనిపించదు. కానీ వైజయంతి కొడుగ్గా మాత్రం తన క్యారెక్టర్ ఆసక్తి రేకెత్తిస్తుంది. ప్రాణంగా ప్రేమించే తల్లే తనను అసహ్యించుకుని దూరం పెడితే.. ఆమె ప్రేమను తిరిగి పొందేందుకు తపిస్తూ.. ఆమెను కాపాడుకుంటూ సాగిపోయే కొడుకు తాలూకు ఎమోషన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. తల్లి కొడుకును అపార్థం చేసుకోవడానికి.. వారి మధ్య దూరం పెరగడానికి దారి తీసే పరిస్థితులను దర్శకుడు ఎఫెక్టివ్ గా చూపించాడు. తల్లి పుట్టిన రోజును కొడుకు సెలబ్రేట్ చేయడం అనే పాయింట్ మీద కథలో కీలక సన్నివేశాలను రాసుకోవడం బాగుంది. పతాక సన్నివేశాల్లోనూ ఆ పాయింటే కీలకం. తల్లి మీద ప్రేమతో హీరో ఎంత దూరం వెళ్తాడన్నది చాలా బలంగా చూపించారు. యాక్షన్ ఘట్టాలు.. స్లో మోషన్ షాట్లతో కొంత భారంగా సాగే ద్వితీయార్ధంలో చివరి అరగంట మాత్రం మంచి ఊపుతో సాగుతుంది. కథలో.. పాత్రల్లోని మలుపులు పతాక సన్నివేశాల మీద ఆసక్తి రేకెత్తిస్తాయి. క్లైమాక్స్ గురించి చిత్ర బృందం చెప్పుకున్న దాంట్లో అతిశయోక్తి ఏమీ లేదు. అందులోని షాక్ ఫ్యాక్టర్.. ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. పతాక సన్నివేశాలు బాగున్న సినిమా మీద ఆటోమేటిగ్గా పాజిటివ్ ఇంప్రెషన్ పడుతుంది. అంతకుముందున్న లోపాలు కూడా పక్కకు వెళ్లిపోతాయి. 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' కూడా అదే ఫీలింగ్ ఇస్తుంది. సగటు మాస్ కథలా అనిపించినప్పటికీ.. తల్లీ కొడుకుల ఎమోషన్ మీద నడిచే ఎపిసోడ్లు.. పతాక సన్నివేశాలు సినిమాను కింద పడిపోకుండా కాపాడాయి.

# భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి చట్టం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి , ఏప్రిల్ 19, భూ సమస్యల సత్వర పరిష్కారానికి భూ భారతి చట్టం తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శనివారం కాటారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి (భూమి హక్కుల రికార్డు చట్టం) 2025 అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.భూ భారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పనలో ప్రజలు అడిగిన సమస్యలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రైతుల భూములకు రక్షణ లభిస్తుందని అన్నారు. రైతులను ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు శాశ్వత పరిష్కారానికి నిపుణుల క్షమిటితో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి పటిష్టమైన చట్టాన్ని రూపొందించి అమల్లోకి తెచ్చిందని తెలిపారు. ప్రత్యేకించి రైతులకు భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని కానీ భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు సులభంగా. పరిష్కరించడానికి అవకాశం ఉందని తెలిపారు. భూ సమస్యలపై రైతులు మీసేవలో దరఖాస్తు చేసుకోవచ్చుని, ఏదైనా సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కరిస్తారని తెలిపారు. ధరణిలో అప్పీలు చేయడానికి అవకాశం. లేదని సివిల్ కోర్ట్ కు వెళ్లాలని కానీ భూ భారతి చట్టంలో తహశీల్దార్ నుండి ఆర్డిఓ, ఆర్డీఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి ల్యాండ్ ట్రిబ్యునల్ నకు వెళ్లాడానికి అవకాశం కల్పించారని అన్నారు. ప్రతి ఏడాది భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను నవనీకరణ చేస్తారని తెలిపారు. రైతులు ఇకపై బ్యాంకు రుణాలకు వెళ్ళినప్పుడు భూములకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, భూ భారతి పోర్టల్ లోని రికార్డులు ఆధారంగా బ్యాంకర్లు రుణాలు ఇస్తారని తెలిపారు.రిజిస్ట్రేషన్ మ్యుటేషన్, సాదాబైనామాకు సంబంధించిన వివరాలు అన్నింటిని రైతులు ఇతర రైతులతో పంచుకోవాలని, చట్టంపై ప్రతి ఒక్కరూ సమగ్రమైన అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు వస్తే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందని, ఒకవేళ రైతులకు ఎవరికైనా న్యాయసహాయం అవసరమైతే ప్రభుత్వ పరంగస్ ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుందని తెలిపారు.ఈ చట్టంతో భూములకు హక్కులు, పట్టాదారు.పాసు పుస్తకాలు అందచేస్తామని, భూమి వివరాలను కూడా మ్యాపులోపొందుపరచడం జరుగుతుందని తెలిపారు. ధరణి నుంచి కొత్త పోర్టల్ భూ భారతికి మారుతున్నందున రెవెన్యూ అధికారులు సమగ్రమైన, స్పష్టమైన అవగహన కలిగి ఉండాలని ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లడానికి పైలెట్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 4 మండ లాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. వచ్చే నెలలో మన జిల్లాలోఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసి ప్రజల నుండి సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. ఈ చట్టాన్ని. పటిష్టంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందని, అందరం కలిసి ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. జిల్లా స్థాయిలో అన్ని మండలాల్లో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై చట్టం పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు.భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి చట్టం ఎంతో ఉపయోగపడు తుందని రైతులు అవగహన కలిగి ఉండాలని, ఏదేని సహాయతకు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. గతంలో ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని, భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డులాగే భూధార్ కార్డు జారీ చేస్తామన్నారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పిల్ వ్యవస్థ లేదని, ఇప్పుడు రెండెంచల అప్పీల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశం భూ భారతి పోర్టల్ ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చుని తెలిపారు. భూమి హక్కుల రికార్డు నిర్వహణతో ఎవరు భూమికి యజమానో స్పష్టత వస్తుందన్నారు. భూమి హక్కుల రికార్డులు భూ భారతి పోర్టల్లో అందరికీ అందుబాటులో ఉంటాయన్నారు. ఎవరైనా భూ హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ కావాలంటే భూ భారతిలో ఉన్న ఫారంలో దరఖాస్తుకు పది రూపాయల ఫీజు చెల్లిస్తే తహసీల్దార్ సర్టిఫైడ్ కాపీ జారీచేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన సందేహాలు, సమస్యలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ బాబు, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్ గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభను విజయవంతం చేయాలి : లకావత్ గిరిబాబు

జూలూరుపాడు, ఏప్రిల్ 19 : ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభను విజయవంతం చేయాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు లకావత్ గిరిబాబు శనివారం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అన్ని వర్గాల



ప్రజలు సుఖ సంతోషాలతో, పాడి పంటలతో ఆనందంతో జీవించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రైతు బంధు లేక, సమయానికి పింఛన్లు ఇవ్వక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వము చేసిన అభివృద్ధి పనులే నేడు కనిపిస్తున్నాయన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఉచిత పథకాలు కాదని అవి ఉత్త పథకాలే అన్నారు. మండలంలోనే కాకుండా రాష్ట్రంలో కూడా ఎక్కడ చూసినా వరి పంటలు ఎండిపోతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, అది మాని అభివృద్ధిపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

## గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి : సీడీపీఓ లావణ్యకుమారి





మునుగోడు, ఏప్రిల్ 19 : తెలంగాణ ప్రభుత్వం, ఐసీడీఎస్ సంయుక్తంగా పోషణ్ అభియాన్ పేరుతో ఏప్రిల్ 8 నుండి 22 వరకు పోషణ పక్షం పేరుతో మండలంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొంపల్లి గ్రామంలో వెదిరె పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీడీపీఓ లావణ్యకుమారి, ఏసీడీపీఓ వెంకటమ్మ మాట్లాడుతూ.. ప్రతి గర్భిణీ అంగన్‌వాడీ సెంటర్‌లో పేరు నమోదు చేసుకుని పౌష్టికాహార లోపం లేకుండా, ప్రతి బిడ్డ ఆరోగ్యంగా పుట్టేవిధంగా చూడాలన్నారు.వెదిరె పూలమ్మ ఫౌండేషన్ సభ్యుడు వెదిరె విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు అందించే టాబ్లెట్స్ ను, పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకుని ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్ మాస్టర్ వెంకట్ నారాయణ, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ గౌస్ బాబా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివేశ, నాగమణి, అంగన్‌వాడీ టీచర్ కళమ్మ, ఏఎన్ఎం యాదమ్మ పాల్గొన్నారు.

## పరిశోధనలో ప్రశ్నావళి ముఖ్యం : ఐపీఈ ప్రొఫెసర్ వై.రామకృష్ణ

నల్లగొండ విద్యావిభాగం(రామగిరి), ఏప్రిల్ 19 : రీసెర్చ్( పరిశోధన) మూలం ప్రశ్నావళి తయారీ అని దానికి ప్రత్యేకమైన స్కేల్స్ ను ఉపయోగించాలని, దాంతో ఫలితం సంపూర్ణంగా ఉంటుందని ఐపిఈ ప్రొఫెసర్ వై. రామకృష్ణ అన్నారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అకాడమిక్ రైటింగ్ ఫర్ పీహెచ్‌డీ స్కాలర్స్ అండ్ యంగ్ టీచర్స్" వర్క్‌షాప్ రెండో రోజు శనివారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ రామకృష్ణ హాజరై డాటా కలెక్షన్, ఎనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ టూల్స్ అండ్ టెక్నిక్స్ అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో శిక్షణకు హాజరైన వారికి వివరించారు. పీహెచ్‌డీ చేసే పరిశోధన విద్యార్థులు డాటా కలెక్షన్‌కు వెళ్లడానికంటే ముందు ప్రశ్నావళి తయారు చేయడంలో ఉపయోగించే స్కేల్స్ తో పాటు తర్వాత వాటిని ఎనాలసిస్ చేయటానికి ఉపయోగించే ఎక్సెల్ షీట్ లోని డాటా అంశాలను ఉదాహరణలతో సహ వివరించారు.

పరిశోధన గ్రంథం సమర్పణలో ప్లాగరిజం ఎంతో దోహదం : డాక్టర్ ఏ.ఎస్ చక్రవర్తి

పీహెచ్‌డీతో పాటు పాటు జనరల్స్, పబ్లికేషన్స్ ఇతర గ్రంథాలను రాసే స్కాలర్స్ తో పాటు అధ్యాపకులు ప్లాగరిజం చెక్ చేసిన తర్వాతే వాటిని సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఫ్లాగరిజం ఉపయోగించే విధానం అర్థమయ్యేలా తెలియజేశారు. అదేవిధంగా ఏ అంశాలను ఏ సైడ్స్ నుంచి లేదా పుస్తకాల నుంచి సేకరించాలి, వాటికి సంబంధించిన బిబ్లియోగ్రఫీ ఎలా పొందుపరచాలి అనే అంశాలని సైతం పీపీటీతో వివరించారు.

రీసెర్చ్ టెక్నిక్స్ ముఖ్యం : ఎంజీయూ ప్రొఫెసర్ అంజిరెడ్డి




రీసెర్చ్ లో ఉపయోగించే టెక్నిక్స్ ఇంటర్‌ప్రిటేషన్స్ అంశాలను మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి వివరించారు. ప్రిన్సెస్ లో సులభంగా టెక్నిక్స్ ను వాడే విధానాలను ప్రాక్టికల్ గా తెలియజేశారు. ఎంజీయూ కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆకుల రవి మాట్లాడుతూ.. రీసెర్చ్ అంశాలపై నిపుణులైన ప్రొఫెసర్ల చేత అకాడమిక్ రైటింగ్ అంశాలపై అందించే శిక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమం ముగింపులో రిసోర్స్ పర్సన్స్, సీనియర్ ప్రొఫెసర్స్ ని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ వర్క్‌షాప్‌లో ఎంజీయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీదేవి, పీడీఎఫ్ స్కాలర్ కొషనోజు రవిచంద్ర, పరిశోధన విద్యార్థి రాంబాబు, ఎంఈడీ, బీఈడి కళాశాల ప్రిన్సిపాల్స్ యాదాచారి, బొడ్డుపల్లి రామకృష్ణ, మిర్యాలగూడ రియల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సీనియర్ ఆధ్యాపకుడు ఏ.జగదీశ్వర్ రెడ్డి, తెలంగాణలోని వివిధ యూనివర్సిటీల పీహెచ్‌డీ స్కాలర్లు, ఎంజీయూ పరిధిలోని యూజీబీజీ కళాశాల సోషల్ సైన్స్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

## మంత్రులు పొంగులేటి, జూపల్లికి తప్పిన ప్రమాదం



నాగర్‌కర్నూల్: మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపి మల్లు రవిలకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో మంత్రులు, ఎంపి భూభారతి సదస్సులో పాల్గొనేందుకు వచ్చారు. ఆ సమయంలో వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్ అవుతున్న సమయంలో హెలిప్యాడ్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. హెలికాప్టర్ ల్యాండ్ కోసం ఇచ్చిన సిగ్నల్ బుల్లెట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

## పటాన్ చెరులో రన్ ఫర్ జీసస్

సంగారెడ్డి జిల్లా:పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్, బీహెచ్‌ఈఎల్ , రామచంద్రపురం, పటాన్ చెరు వరకు రన్ ఫర్ జీసస్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పటాన్ చెరు నియోజకవర్గం క్రిస్టియన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో పటాన్ చెరు మైత్రి గ్రౌండ్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కే ఏ పాల్ పాల్గొన్నారు. రామచంద్రపురం లో రన్ పర్ జీసస్ ర్యాలీ లో అయన ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపర్లు, యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దారి మధ్యలో కాసేపు యువతి యువకులు నృత్యాలు చేస్తూ యేసయ్యను ఆరాధిస్తూ పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎజీ జూజీబీశ్రీ మాట్లాడుతూ రన్ ఫన్ జీసస్ విజయవంతంగా చేసినందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. జీసస్ అందరి కొరకు వచ్చాడు. ప్రవీణ్ పగడాల కేసు పై పిటిషన్ వేసాను అన్నారు. సొంత డబ్బులు తో హిందూ, క్రిస్టియన్, ఎబీబశ్రీతిఎబ కి పెన్షన్ ఇపించను. రానున్న రోజుల్లో ఎజీ జూజీబీశ్రీ ప్రజా శాంతి పార్టీ తో పోరాడి సీఎం గా ఉంటాను.

## పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి.

### దిల్ సుఖ్ నగర్ రాజీవ్ చౌక్ వద్ద నిరసన ప్రదర్శన. పెద్ద ఎత్తున పాల్గొన్న విహెచ్పి, భజరంగ్ దళ్ శ్రేణులు.

హైదరాబాద్:ఏప్రిల్ 19, పశ్చిమ బెంగాల్లో ముష్కర మూకలు హిందువుల పై దాడులు చేసి చంపడం దారుణమని, కేంద్ర ప్రభుత్వం వెంటనే అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని వి హెచ్ పి జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, వివేకానంద జిల్లా అధ్యక్షులు పురుషోత్తమ్ రెడ్డి అన్నారు. పశ్చిమ బెంగాల్లో హిందువుల పై దాడులను ఖండిస్తూ శని వారం దిల్ సుఖ్ నగర్ రహదారి పై వి హెచ్ పి,భజరంగ్ దళ్ నిరసన కార్యక్రమం చేపట్టింది. వందలాది మంది వి హెచ్ పి,భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... వక్ఫ్ బోర్డు నవరణ బిల్లుకు వ్యతిరేకంగా కొందరూ ముష్కర మూకలు హిందువులపై దాడులు చేసి చంపారని, ఆస్తులను ధ్వంసం చేసి లూటీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది హిందువులు ఇండ్లను ఖాళీ చేసి పోయారని తెలిపారు. మమతా బెనర్జీ హిందువులకు రక్షణ కల్పించలేకపోతున్నారని, ఓటు బ్యాంక్ కోసం దేశ భద్రతకే ఆటంకంగా మారిందని వాపోయారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించి హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఈ-వేస్ట్ ను ట్రిపుల్ ఆర్ సెంటర్ లో అందించండి

### కమిషనర్ ఎన్.మౌర్య

హైదరాబాద్:ఏప్రిల్ 19, నగరంలో ప్రతి ఇంటి వద్ద, దుకాణాల వద్ద ఉత్పత్తి అయిన ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వస్తువులు) ను రాయల్ నగర్ నందు ఏర్పాటు చేసిన ఆర్.ఆర్.ఆర్ సెంటర్ నందు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా ప్రతి మూడవ శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ తెలిపారు. ఈ నెల ఈ-వేస్ట్ నిర్వహణ, సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ-వేస్ట్ సేకరణ నగరంలోని న్యూ బాలాజి కాలని అన్నా క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్ వద్ద వద్ద ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు సేకరిస్తామని తెలిపారు. ఎలక్ట్రికల్ వస్తువులు అయిన కంప్యూటర్లు, బ్యాటరీలు, సెల్లులు, ఎలక్ట్రికల్ ఫోన్ తదితర వస్తువులు అన్ని ఆర్ఆర్ఆర్ సెంటర్ వద్ద ఇవ్వ వచ్చునని అన్నారు. నగరంలో ఉత్పత్తి అవుతున్న ఈ-వేస్ట్ సేకరణ, నిర్వహణపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటలకు పాత మునిసిపల్ కార్యాలయం నుండి శ్రీదేవి కాంప్లెక్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ - వేస్ట్ అంటే ఏంటి, ఏ ఏ వస్తువులు ఉంటాయి, వాటి సేకరణ, నిర్వహణపై శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద అవగాహన కల్పిస్తామని అన్నారు. నగరంలో సేకరించిన ఈ వ్యర్థాలను బెంగళూరు పంపి వందశాతం నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవగాహన ర్యాలీ లో ప్రజలు, విద్యార్థులు, దుకాణ దారులు పాల్గొని విజయవంతం చేయాలనే కోరారు.


## న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టలపై స్పందించాలి

### -మాజీ ఎంపీ చింతామోహన్

హైదరాబాద్:ఏప్రిల్ 19 న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టల విషయంపై కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ హోంమంత్రి అమిత్ షా స్పందించాలని మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ తో కలిసి మాట్లాడారు. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయినా యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్లకట్టల ఆరోపణలు దేశం మొత్తం అలజడి సృష్టించినా ఈ డి ఐ టి ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. రాజకీయ ప్రత్యర్థులపై సాధారణ వ్యక్తులపై ఈడిని ఐటీని ప్రయోగిస్తున్న కేంద్ర ప్రభుత్వం సుమారు 500 కోట్లకు పైగా నోట్లు కాలిపోయినట్లు ఆరోపణలు వచ్చిన విషయంపై ఎందుకు మిన్నకున్నారని ప్రశ్నించారు. ఏ స్థాయిలో అవినీతి జరిగితే ఆ స్థాయిలో నోట్ల కట్టలు బయటపడతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ అంశంపై ప్రత్యేక దృష్టిసారించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యష్టపై నమ్మకాన్ని పెంపొందించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ లకు ప్రభుత్వ టెండర్లలో కర్ణాటక తరహాలో ఇతర రాష్ట్రాలలో కూడా 24 పర్సెంట్ ప్రభుత్వం టెండర్లు ఇవ్వాలని కోరారు. బడా పారిశ్రామిక లకు గుజరాత్ వ్యాపారులకు మార్వాడీలకు మాత్రమే బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నాయని వారితోపాటు ఎస్సీ ఎస్టీ బీసీలకు సైతం రుణాలు మంజూరు చేయాలని కోరారు. పార్లమెంట్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై ఈడీ కేసులు విచారకరమని అన్నారు అభివృద్ధి సంక్షేమ పథకాలపై నిత్యం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేకే రాజ్యాంగబద్ధ సంస్థలను అక్రమంగా వినియోగిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం తన తీరు మార్చుకొని ప్రజలకు మంచి పాలన అందించాలని కోరారు.

## గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నిరసన

కారేపల్లి, ఏప్రిల్ 19 : ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సిపిఎం



పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కుందనపల్లి నరేంద్ర మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా గ్రామ పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు.పంచాయతీ కార్మికులకు నెలనెలా వేతనాలు చెల్లించి, అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులను కోరారు. నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు, ఉమావతి, తలారి దేవప్రకాశ్, అన్నారపు కృష్ణ, ముండ్ల ఏకాంబరం, పాసిని నాగేశ్వరరావు, వీరమల్లు, యాసిన్, చంద్రయ్య, వీరమ్మ పాల్గొన్నారు.

## యేసు పునరుద్దాన రన్ ఫర్ జీసస్




సరుబుజ్జిలి(విజయ సారథి): మండల కేంద్రంలో పెంతుకోస్తు చర్చ్ రెవ ఈథ శామ్యూల్ జాన్ అధ్యక్షతలో నిర్వహించిన పునరుద్దాన రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారి కూడలి ఉదయం 6 గంటల నుండి నిర్వహించిన ఈ ర్యాలీలో రెవ జి సామ్యూల్ అరుణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షుడు క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ,యేసు పునరుద్దాన శక్తి కలిగిన సువార్తను ప్రకటించడం జరిగింది పాటలతో స్లొగన్స్ తో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు పాస్టర్ సంసోన్,పాస్టర్ అహరోన్ రాజు, అదపాక రామారావు, అద్వకేట్ అదపాక సొలోమోను,సంసోను , ప్రసాదు, ఆశిష్, ఆకాష్ , లుదియమ్మ ,గువ్వాడ ధర్మరాజు ,హెప్సిబా , ఎస్తేరు , కేసారం కామేశ్వరరావు మొదలగు వారు పెద్ద ఎత్తున విశ్వాసులు, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

## నీట్ యూజీ పరీక్ష నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేయండి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



.నంద్యాల(విజయ సారథి):మే 4వ తేదిన జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ ) యూజి పరీక్ష నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో ఉన్న గవర్నమెంట్ హై స్కూల్, టేక్కే జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర కళాశాలల గదులను పరిశీలించారు. డీఈవో జనార్దన్ రెడ్డి, నీట్ అబ్జర్వర్ సత్యనారాయణ, ఆర్డీవో విశ్వనాధ్ తదితరులు కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కళాశాలలోని గదులను పరిశీలిస్తూ మే నాలుగో తేదీన జరిగే నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) యూజీ పరీక్ష నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను సూచించారు. జిల్లాలో దాదాపు 1,170 మంది విద్యార్థులు నీట్ పరీక్షలు రాస్తున్న నేపథ్యంలో పిల్లలకు ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు నిర్వహిస్తున్న ప్రతి కళాశాల లో డెస్క్ లు శుభ్రంగా ఉండడంతో పాటు ఒక్కో విద్యార్థికి ఒక్కో డెస్క్ కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన విద్యుత్ తో పాటు, ఫ్యాన్లు కూడా ఉ ఒడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో కూల్ వాటర్ ను తప్పనిసరిగా ఉంచాలన్నారు. బాలికలకు, బాలురులకు వేరువేరుగా టాయిలెట్లు ఉండాలని కలెక్టర్ సూచించారు. వికలాంగ అభ్యర్థులకు అనువైన పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వీల్ చైర్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో గోడ గడియారాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలకు త్వరగా హాజరయ్యే విద్యార్థులకు బిస్కెట్స్ ఏర్పాటు చేసుకునేందుకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటా 3 శాతం

### 2నుంచి 3 శాతానికి పెంచినట్లు మంత్రి వెల్లడి

అమరావతిఏప్రిల్19: ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు మార్గదర్శకాలను జారీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీ క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. క్రీడాకారుల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పోర్ట్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారుల అభివృద్ధికి నిస్వార్థంగా పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఈ ఉత్తర్వులతో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖలతో సహా యూనిఫార్మ్డ్ సర్వీసుల్లో పోటీ పరీక్షలకు నేరుగా నియామక అవకాశాలు లభించనున్నట్లు- వెల్లడించారు. మొత్తం 65 క్రీడా విభాగాలు ఈ ప్రత్యక్ష నియామకాల్లో భాగస్వామ్యం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ప్రోత్సాహంతో క్రీడాకారులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటు-లోకి మంచి భవిష్యత్తే తమ ధ్యేయమని, క్రీడల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి చెప్పుకొచ్చారు. క్రీడల అభివృద్ధికి ఆంధప్రదేశ్ ప్రభుత్వం కట్టు-బడి ఉందని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు.

# కాలుష్య రహిత జిల్లాగా కడప:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### స్వచ్ఛ దివస్ లో భాగంగా.. కడప నగరంలో "ఈ-చెక్" కార్యక్రమానికి శ్రీకారం

### 7 రోడ్స్ నుండి 1 టౌన్ సర్కిల్ వరకు వరకు.. సాగిన స్వచ్ఛతా ర్యాలీ

కడప(విజయ సారథి):స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో. భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా. ప్రభుత్వ విప్, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డితో కలిసి.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి "ఈ-చెక్" (ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) కార్యక్రమాన్ని కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కడప 7 రోడ్స్ నుండి స్వచ్ఛత ర్యాలీని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించగా. 1 టౌన్ సర్కిల్ వరకు సాగిన స్వచ్ఛతా ర్యాలీలో అధికారులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.స్వచ్ఛ దివస్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ శనివారాన్ని "ఈ-చెక్" థీమ్ తో మనం వాడిన ఎలెక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను సేకరించే కార్యక్రమంను చేపట్టడం జరుగుతోందన్నారు. ఆ మేరకు స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేద్దామన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ అంశానికి సంబందించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో కూడా ఎలక్ట్రానిక్ వస్తువులు వాడుతూనే ఉంటారని, వాటి వ్యర్థాలను మన నివాస ప్రదేశాల్లో ఉంచుకోవడం ఎంతో ప్రమాదకరం అన్నారు. మన పరిసరాలను కూడా అవి విషపూరితం చేస్తాయని తెలిపారు. ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. ప్రతి ఇళ్ళూ, ప్రతి కార్యాలయం, ప్రతి వాణిజ్య సముదాయంలో ఈ ఎలెక్ట్రానిక్ వ్యర్థం సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతినెల మూడవ శనివారాన్ని స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ప్రతి నెలా స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో భాగంగా.జిల్లా అంతట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, తడి పొడి చెత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని.దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మన జిల్లాను ఆరోగ్య జిల్లాగా, కాలుష్య రహిత జిల్లాగా తీర్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ.ప్రతి నెల మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రా దివస్ గా.నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అదికూడా మన జిల్లా నుండే మూడు నెలల క్రితం అమలు కావడం శుభపరిణామం అన్నారు. మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా, మన జిల్లాను స్వచ్ఛమైన కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ఈ మాసం లో "ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్"(ఈ వేస్ట్ రీసైక్లింగ్) అంశంతో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మేరకు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి ప్రోగు చేసేందుకు కడప మున్సిపాలిటీలో ఒక అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేశామని, నగరంలోని నివాసాల నుండి సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరణ కేంద్రంలో




అందజేయాలన్నారు. ఎలెక్ట్రానిక్ వెస్ట్ మొత్తాన్ని పునర్వినియోగం చేసేలా. ప్రత్యేక పద్ధతుల ద్వారా ప్రాసెసింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించడం ద్వారా మన ఇంట్లో స్థలం కలిసి రావడంతో పాటు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పగలం అన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదాన్ని ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఉ ద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ బ్యాంకింగ్ - నగదు రహిత లావాదేవీలు




వెలుగోడు(విజయ సారథి): మండల పరిధిలోని ఏపిఎం కార్యాలయంలో శనివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ,సొసైటీ ఫర్ రూరల్ ఎకో డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో, అన్ క్లైమేట్ డిపాజిట్ అవగాహన సదస్సు నిర్వహించారు .ఈ సదస్సుకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎస్ అబ్దుల్ ఖరీం, ఏపిఎం సుగుణ పాల్ రిసోర్స్ పర్సన్స్ కొమ్ము పాలెం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు సీసీలు జ్యోతి ,సుబ్బారాయుడు పాల్గొన్నారు. మేనేజర్ మాట్లాడుతూ, పొదుపు దాని యొక్క ప్రాధాన్యత ,అవసరం, అనవసరం ,ఇన్సూరెన్స్, రెన్యువల్ వాటి వల్ల కలిగే లాభాలు, జీవన శైలిలో వస్తున్న మార్పులు, ఆరోగ్య స్థితిగతులపై ఆర్థిక లావాదేవీలు ,అభివృద్ధి అంశాల పైన, పొదుపు కీలకమైందని స్పష్టం చేశారు. సదస్సు అనంతరం, గ్రూప్ డిస్కర్షన్ ద్వారా కొన్ని విషయాలు తెలియజేశారు . రిసోర్స్ పర్సన్స్ కొమ్ముపాలె శ్రీనివాస్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, డిజిటల్ బ్యాంకింగ్ నగదరహిత లావాదేవీలు, భౌతిక నగదు, వినియోగాన్ని బాగా తగ్గించడమే ,నగదు రహిత లావాదేవీల వల్ల ,అవినీతి, నల్లధనం ,నకిలీ నోట్ల చలామణి తగ్గుతుంది .ఆర్థిక వ్యవహారాలలో పారదర్శకత, జవాబుదారితనం, పెరుగుతుంది .ఎక్కడి నుండైనా లావాదేవుని జరవవచ్చు. 24 చీ7 చీ365 రోజులు అన్నివేళలా లావాదేవీలు జరవవచ్చు, నగదు తీసుకొని పోవలసిన అవసరం లేదు, చిల్లర సమస్య రాదు. నకిలీ నోట్ల ప్రమాదం లేదు ,లావాదేవీలు సురక్షితం మరియు సులభతరం ,మీ విలువైన సమయం వృథా కాదు ,బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు ,తక్షణ సేవలు వేచి ఉండాల్సిన అవసరం లేదు, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా చేసుకోవచ్చు ,గూగుల్ పే ,ఫోన్ పే వల్ల, వయోవృద్ధులు మోసపోకుండా ,డిజిటల్ బ్యాంకింగ్ దోహదకారిగా ఉంటుంది .ఆర్థికపరమైన విషయాల్లో మొబైల్ని జాగ్రత్తగా వాడాలని సూచించారు. బ్యాంకింగ్ పాస్వర్డ్ ,ఓటీపీ నెంబరు, ఏటీఎం పిన్ నెంబర్ సి.బి.వి నెంబరు ఎవరికి ఇవ్వరాదన్నారు. వీలైనప్పుడు పాస్వర్డ్ మార్చుకోవాలని సలహా ఇచ్చారు. మీరు కొన్ని క్లైములతో తక్షణమే బదిలీ చేయవచ్చు, మరియు చెల్లింపు చేయవచ్చు, అనంతరం గ్రూప్ డిస్కషన్లు చర్చలు చేయించారు.

## 45వ డివిజన్లో గుర్రం హల్చల్..

### నేను చూసుకుంటామీరు కానీయ్యండి అంటున్న బిల్డింగ్ ఇన్స్పెక్టర్ గౌడ్.ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు తూట్లు

### .నిబంధనలకు పాతర వేస్తున్న గుర్రం, గౌడ్ లు అక్రమ కట్టడాలను అడ్డుకునే నాధుడు లేడా

విజయవాడ(విజయ సారథి, ప్రతినిధి సిరివెళ్ల నాగరాజు):ప్రభుత్వాలు మారినా విజయవాడ మహానగరంలోఅడ్డగోలు నిర్మాణాలు మాత్రం ఆగటం లేదు.కనీసం అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ భారీ భవంతుతు నిర్మిస్తున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన వీఎంసీ అధికారులు బిల్డర్లు ఇచ్చే కాసుల వర్షంలో తడుస్తూ నిబంధనలను తుంగలో తొక్కి మరీ బిల్డర్లకు సహకరిస్తున్నారు. 46వ డివిజన్లో గత కొంతకాలంగా గుర్రం హల్చల్ ఆగటం లేదు. బిల్డింగ్ ఇన్స్పెక్టర్ మురళీ గౌడ్ సహకారంతో అక్రమ కట్టడాలకు తెరలేపుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎక్కడా అవినీతికి పాల్పడటానికి వీలు లేదు, పారదర్శకంగా వెళ్లాలి అంటూ ఒక పక్క ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతుంటే మరోపక్క 46వ డివిజన్లో మాజీ కార్పోరేటర్ని, టిడిపి నాయకుడిని అంటూ ఎటువంటి అనుమతులు లేకుండా భారీ నిర్మాణాలు చేపట్టారు. దీనికి మద్దతుగా బిల్డింగ్



ఇన్స్పెక్టర్ నిలుస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇంత ఘోరంగా అడ్డగోలు నిర్మాణాలు చేపడుతున్న గౌడ్కు అందాల్సింది అందిందా.. అందుకే అటువైపు కన్నెత్తి చూడటం లేదా అనే ఆరోపణలు కూడా లేకపోలేదు. విజయవాడ లో ఎక్కడా లేని విధంగా గౌడ్ ఉన్న ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా అనేక భవనాలు అడ్డగోలుగా నిర్మించివేశారు. మరికొన్ని నిర్మిస్తున్నారు కూడా... మరి ఎందుకు ఈ ప్రాంతం అంటే వీఎంసీ అధికారులకు మక్కువో అర్థం కావడం లేదు.. గతంలో సీటీ ప్లానర్ ప్రసాద్కు భారీ స్థాయిలో ముడుపులు అందించారనే ఆరోపణలు లేకపోలేదు. నూతనంగా వచ్చిన సీటీ ప్లానర్ పట్టించుకుంటారా.. ఇలాంటి అక్రమకట్టడాలపై కన్నెస్తారా... లేక గత ప్రసాద్ లాగా ప్రసాదాలు అందుకుని వదిలివేస్తారా అనేది వేచిచూడాలి.మురళీగౌడ్ పరిధిలో జరుగుతున్న మరిన్ని భవనాలు. 46వ డివిజన్లో జరుగుతున్న అడ్డగోలు నిర్మాణాలపై మరో కథనంలో

## కర్నూలు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను:

### రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్



కర్నూలు(విజయ సారథి):కర్నూలు ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్ స్టిట్యూట్లో లీనియర్ యాక్సిలరేటర్, సి.టి సిమ్యులేటర్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ ఆంకాలజీ వార్డులను మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి టి.జి భరత్ మాట్లాడారు. క్యాన్సర్ ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేశానన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో మెరుగైన సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కర్నూల్ మెడికల్ కాలేజీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది పేరొందిన డాక్టర్లు కర్నూల్ మెడికల్ కాలేజీలోనే చదివారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తన శాఖకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎంతో కష్టపడుతున్నారన్నారు. కార్పొరేట్ హాస్పిటల్ కు దీటుగా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిని నెలకు లేదా రెండు నెలలకు ఒకసారి తప్పకుండా విజిట్ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని.. మంత్రి టి.జి భరత్ కోరారు.

## కిర్లంపూడి లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్

.కిర్లంపూడి(విజయ సారథి): స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతీ నెలా మూడవ శనివారం నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమంలో ఈ నెల ఈ-వ్యర్థాల సేకరణ మరియు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రీసైక్లింగ్ చేయుటకు గ్రామాల్లో సేకరణ చేపట్టడం జరిగింది. కిర్లంపూడి ఎంపీడీవో కార్యాలయం నుండి ఎంపీడీవో బి హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు గుండా నిర్వహించారు. కిర్లంపూడి మండలం లోని అన్ని గ్రామ పంచాయతీలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ర్యాలీలు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ఎంపిడిఓ హరికృష్ణ, ఈవో పిఆర్డి సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎన్టీఆర్ రమేష్ బాబు పాఠశాల విద్యార్థులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయముల సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com